జయజయ శంకర



హరహర శంకర

సంపుటి : 2 సంచిక : 1

శ్రీః

# కామకోటి వాణి

శ్రీ శోభకృత్ నిజ శ్రావణ మాసం - ఆగస్టు 2023




శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము

# “Competition తట్టుకుంటూ Compassionతో ముందుకు రావాలి”

## Indian Institute of Technology, Tirupati Campusలో స్వామివారి అనుగ్రహభాషణం

గురుర్ బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మా తస్మై శ్రీ గురవేనమః ॥
యా కుందేందు తుషారహార ధవళా యా శుభ్రవస్త్రాన్వితా
యా వీణావరదండమండితకరా యా శ్వేత పద్మాసనా ।
యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిర్దేవైస్సదా పూజితా
సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేషజాడ్యాపహా ॥

శ్రుతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయమ్ ।
నమామి భగత్పాద శంకరం లోకశంకరం ॥
అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం ।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదాన్వహం ॥
సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం ।
అస్మదాచార్య పర్యన్తాం వందే గురు పరంపరాం ॥



'విజ్ఞానం యజ్ఞం తనుతే' అని వేదంలో చెప్పబడింది. పూర్ణకలశం స్వాగతం చెప్పేటప్పుడు 'వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః సన్యాస యోగాత్ యతయః శుద్ధ సత్త్వాః' అని చెప్తారు. భౌతిక ప్రపంచంలో సుఖం, సంపద, భద్రత, ఆరోగ్యం విషయాలలో మెటీరియల్ సైన్స్ మనకు ఉపయోగపడుతుంది. మనస్సుకి సంబంధించిన విజ్ఞానానికి వేదాంతం ఉపయోగపడుతుంది. అందుకని వేదాంతాన్ని విజ్ఞానం క్రిందనే చూశారు. విజ్ఞానం ఉన్న వాళ్ళు వేదాంతం మీద గౌరవం పెట్టుకున్నారనే విషయం ఒకటైతే, వేదాంతంలో ఉన్న సత్యం, అద్వైతం, ఫిలాసఫి, లాంటివన్నీ కూడా విజ్ఞానం క్రింద చెప్పబడడం జరిగింది. 'వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః' అంటే అర్థం చేసుకోవడంలో నిస్సందేహంగా, భావార్థాన్ని గ్రహించాలంటే దానికి విజ్ఞానం కావాలి. అది వేదాంతమే అయినా విజ్ఞానం అవసరం. భూమి, నీరు, నిప్పు, ఆకాశం, ఇనుము, పంచధాతువులు, బంగారంలాంటి ఏ ధాతువు గురించి అయినా భౌతిక ప్రపంచంలో శీతోష్ణ సంబంధాల గురించి తెలుసుకోవటానికి విజ్ఞానం అనేది కావాలి. విజ్ఞానం చేత నిశ్చయం చేసిన విషయాన్ని సప్రమాణము అంటారు. అంటే స్వీకృత, స్వీకార, అంగీకారాలు, అంటారు. (authenticity, acceptance, recognition అంటారు.)

విజ్ఞానం వల్లనే వస్తువులకు గుర్తింపు వస్తోంది. ప్రయోగశాలల్లో ఉష్ణసహన శక్తి, శీతలసహన శక్తి, వేగం ఎలా ఉంటుందో – రెండు వస్తువుల కలయిక ఎలా ఉంటుందో స్వభావంతో పరీక్షిస్తారు. భావం కలుస్తుందా అని చూస్తారు. లోతుగా పరీక్ష చేస్తారు. ఈ ప్రయోగశాల అనేది మనదేశంలో ఋషులు తపస్సుతో సాధించారు. శాస్త్ర అనుసంధానం చేసి ఆయుర్వేదం, జ్యోతిష్యం, అంతరిక్షశాస్త్రం, సమరాంగణ సూత్రం, గణితం – బీజగణితం, గ్రహ గణితం, మంత్రశాస్త్రం, ఇంకా ఎన్నో విద్యలు, భారతీయ ఆర్ష సంస్కృతి అనే విజ్ఞాన రూపంలో మనకి అందించారు. తర్వాత కాలంలో మనుష్యుల శక్తి తగ్గి ఇప్పుడు calculator, computer అవసరం వస్తోంది. ఈ సాధనాలకి మనం అలవాటు పడిపోయాము.

మహాభారతంలో భీముడికి అర్జునుడికి ఉన్న అనంతమైన శక్తులను జంతు శక్తితో పోల్చడం జరిగింది. ఇప్పుడు దానిని horse power అంటారు భారతీయ విజ్ఞానం ప్రకృతి ఆధారితమైనది. భద్రపూరితమైనది కూడా. నిదానమైన విజ్ఞానం కావచ్చు కాని పూర్ణ విశ్వాసంతో కూడిన శాంతి ప్రధానమైన విజ్ఞానము. భారతదేశం యొక్క



ఉద్దేశ్యం, లక్ష్యం, సంకల్పం అనేవి శాంతి పరిరక్షణ. మనం ప్రపంచానికి ఇచ్చేవాళ్ళమే కాని ఇబ్బంది పెట్టేవాళ్ళం కాదు. అహింసా, సత్యం, ప్రేమ, అనురాగం ఈ భూమిలో స్వభావ సిద్ధంగా కలిసి ఉంటాయి. అందువల్ల ఇక్కడ ఉండే ఏ అభివృద్ధి అయినా సమాజ వికాసం కలిగిస్తుంది. భారతదేశంలో ఒక వెయ్యి సంవత్సరాలు అస్థిరత, నాయకత్వం మార్పుల వల్ల మన వనరులు, ఖనిజాలు, నీరు, అడవులు మానవశక్తి హరించిపోయింది. ఇంకా ఆర్థిక ఇబ్బందులు కారణం చేత వెనకబడిపోయాము. పాలనాపరంగా ఒక శాసనం, నీతి అని లేకపోవడం చేత ఉన్నవాటిని సరిగా ఉపయోగించడం జరగలేదు. One India - One Nation - One Ration అంటారు గాని మనకంటూ ఆర్థిక వనరులు, అధికారము లేవు.


పూర్వం రాజుల కాలంలో చోళ, పాండ్య, పల్లవ రాజులు వ్యాపారం చేశారని, విదేశ వాణిజ్య సంబంధం, ధృడంగా ఉండేదని మన చరిత్రలో చెబుతుంటారు. వారు ప్రయత్నమైతే చేశారు కాని ఇక్కడ ఉండే జనాభాకు తగినదిగా, ప్రజల యొక్క అవసరాలు తీరేలా జీవన ప్రమాణం పెరగలేదు. విదేశాలకు ప్రత్తి, ఖనిజం, పంపించడం జరిగింది కాని అది విదేశీ వ్యక్తులకే ఉపయోగపడింది. మన సంపద మన దేశానికి పూర్తిగా ఉపయోగపడింది అని చెప్పలేము.

1947లో దేశం యొక్క ప్రధాన భాగానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నూతన విద్యావిధానం అమలుపరిచారు. ప్రజల యొక్క సంక్షేమానికి ధర్మం, సంస్కృతి ఒక వైపు ఐతే వ్యవసాయం, అడవులు ప్రకృతికి సంబంధించిన విద్యలు మరోవైపు ఉన్నాయి. ఆదాయం అభివృద్ధి చెందే సమయంలో పరిశ్రమలు వచ్చినప్పుడు వాటికి సంబంధించి నూతన విద్య అవసరమైంది. వనరులు వ్యర్థం కాకుండా ఉత్పత్తి రంగ అభివృద్ధి, వాణిజ్యం, ద్రవ్య నిర్వహణకు మనకి విద్యావిధానంలో మార్పులు అవసరం అయినాయి.

అప్పట్లో ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూగారి నుండి ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీగారి వరకు ప్రధానమంత్రులందరూ అభివృద్ధి విషయంలో మంచి ఆదరణ చూపిస్తూ వచ్చారు. మన దేశంలో ఉచ్ఛ శిక్ష, గణితం బాగానే ఉంది. గణితంలో మనస్సు లెక్కలంటారు. పలక, బలపం లేకుండా మనస్సులో లెక్కపెట్టేస్తారు. Calculator లేకుండా పంచాంగ గణితం చేసిన దేశం ఇది. కాని ఇప్పుడు ఏకాగ్రత, స్థైర్యం, బలం, సహనం తగ్గింది. జాబ్ సెక్యూరిటీ పెరిగింది.

సారథ్యం అంటే కృష్ణ పరమాత్మదే. ఏడు గుఱ్ఱాలతో రథాన్ని నడుపుతూ పార్థసారథిగా ఉండి అర్జునుడికి భగవద్గీతను ఉపదేశించారు.







మనది చిత్రమైన, ఆశ్చర్యకరమైన, విరోధం లేని దేశం. అలాంటి దేశంలో అద్వైతం అనే బీజాన్ని, నాటిన శంకరాచార్యులవారు జీవిత లక్ష్యం అధికారం, ఆడంబరం, అశ్రద్ధ, అహంకారం కాదు అనే విషయాన్ని చాటారు. తమ తపస్సు, ఉపదేశం, సంచారం చేత ఆయన మనకి దానిని ప్రత్యక్షంగా ఆచరించి, చూపించి, ఆదర్శంగా ఉన్నారు. మన దేశం శాంతి కోరుకుంటూ, నిరాడంబర జీవితానికి నిదర్శనంగా ఉంది. పరస్పర సహాయం, పరోపకారం చేస్తున్న దేశం మనది. మన వికాసం వలన ఇంకొకరికి వికాసమే వస్తుంది, మన దేశ లక్ష్యం సదుద్దేశ సహింతగా ఉంటుందని మన తత్త్వాన్ని శంకరాచార్యులవారు చాటి చెప్పారు.

భావాలు మంచిగా ఉన్నా భావ ప్రకటన అనేది ముఖ్యమైన విషయం. (expression of thought) మంచి భావాలను ఇంకా వేగంగా అమలు చేయడానికి మనకి మంచి సంస్థలు కావాలి. ఆ సంస్థల కోసం విదేశీ సత్సంబంధాలతో, వారి సహకారం తీసుకోవడంలో సంకోచం లేదు. ఇంకొకరు గొప్పవాళ్ళని చెప్పటంలో మనకి చిన్నతనం ఏమి లేదు. అందరినీ గౌరవిస్తాం. 'విద్వాన్ సర్వత్ర పూజ్యతే' తెలివి ఎక్కడ ఉంటుందో, అక్కడ వారు పూజింపబడతారు అని చెప్పిన దేశం మనది. ట్రాన్స్‌పోర్టు, రైల్వే బ్రిటీష్ వాళ్ళు పరిచయం చేశారు. వాళ్ళు చేసిన మంచి పనిని మనం ఈ రోజుకీ గౌరవిస్తాం. దేశం కోసం మంచి చేసిన వాళ్ళని ఈ రోజుకి కూడా తలుచుకుంటారు. (ఈ మధ్య గోదావరి జిల్లాలకు వెళితే అక్కడ బ్రిటీష్ వాళ్ళు పాలించిన కాలంలో పంటలు బాగా పండటానికి కృషి చేసిన కాటన్‌గారి గురించి ప్రజలు మంచిగా చెబుతున్నారు. నీరు వృధా కాకుండా ఆయన బ్రిడ్జి కట్టించారు. దాని వలన స్వస్థత, సమృద్ధి అనేది వచ్చింది. ఆంధ్రకి గోదావరి ప్రదేశం అనేది బియ్యం, ప్రత్తి, పప్పు దినుసులు అందిస్తుంది.) అలా మన ఉద్దేశ్యాలు మంచిగా ఉండి, ప్రయత్నాలు కూడా మంచిగా ఉండాలి. దానికి సమన్వయం

అనేది (integral approach) కావాలి. అంటే అభివృద్ధి, శాంతి ఒక పక్కన ఉంటే పరిపాలన, ప్రభుత్వం మరోవైపు ఉండాలి. విదేశీ దృష్టికోణంతో చూడకూడదు. (దృష్టిదోషమని గుమ్మడికాయ తిప్పుతారు. దాంట్లో ఇతర దృష్టి, అహిత దృష్టి, క్రూర దృష్టి, అనేక విధాలైనవి దృష్టుల గురించి చెబుతారు. దేశంలో దానిని అసూయ అంటారు.) కొందరు ఋజువుగా ఉంటే కొందరు మృదువుగా ఉంటారు. సాఫ్ట్‌వేర్ ఒకరైతే సఫరింగ్ ఇంకొకరు. పైకి బాగానే ఉంటారు కాని లోపల ఏముంటుందో తెలియదు. అది కుటిల కౌటిల్యం. మనుషుల అలోచనలు అనేక రకాలగా ఉంటాయి. ఇవన్నీ తట్టుకుని మనం మంచి సిద్ధాంతాలు పెట్టుకొని ఇంత పెద్ద Democracyని నడుపుకుంటున్నాం. మనం modern lifeలో కూడా competetion తట్టుకోగలగాలి. Compassionతో ముందుకు రావాలి. మనం పోటీలో ముందు ఉండాలి. దేశంలో ప్రజలు స్పర్ధలో ముందు ఉండాలంటే శ్రద్ధలో ముందు ఉండాలి. శ్రద్ధ విషయనికి వస్తే మన దేశంలో interest rates ఎక్కువగాని interest తక్కువగా ఉంటోంది ఈమధ్య. మనకు ఇంకా దేశభక్తి పెరగాలి. విజ్ఞానమని చెప్పినప్పుడు వైదిక, లౌకిక విజ్ఞానంలో కూడా మనం ఇంకా సాధించాల్సినవి ఉన్నాయి. ఇప్పుడు మన తర్వాత generation టెక్నికల్‌గా బాగా ఎదుగుతున్నారు. Computersలో కూడా 5, 6, 7 generation నడుస్తోందని అంటారు. లాభాపేక్షకు అతీతంగా శక్తిని generate చెయ్యాలి. పని చెయ్యడానికి మనుష్యులను తయారు చెయ్యాలి. పని దొరకటం అనేది ఒక సమస్య ఐతే పని తెలుసుకున్నవారు దొరకడం ఇంకా ముఖ్యం. దేశంలో ఉండే ఒక ముఖ్యమైన సమస్య ఇది.

'ఉద్యమః కార్యసాధకః' అంటే ఎంత సేపు పనిచేస్తున్నాము అని కాకుండా ఉద్దీపనతో పని చెయ్యాలి. దేశం నాకేం చేసిందని చూడొద్దు. దేశానికి నువ్వు ఏం చేస్తున్నావు అని ఆలోచించాలి. అలా దేశం కోసం మనం చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. దానికి ప్రభుత్వం, ప్రజలు, కలిసి పోరాడాలి. సంస్థలోని ప్రొఫెసర్స్, ప్రభుత్వం, పేరెంట్స్, (ppp) కలుసుకొని మంచి విద్యావిధానం అమలు పరచాలి. Prime Minister గారి నుంచి కూడా దీనికి encouragement వచ్చి మంచి ఆవాస వ్యవస్థ, schools, పర్యావరణం, నిశ్శబ్దమైన, నైసర్గికమైన, నిగూఢత్వంతో కూడిన మంచి campusలతో కాన్పూర్, చెన్నై, ఖరగ్‌పూర్, ముంబై, ఢిల్లీలలో IIT Campusలు మంచి అభివృద్ధికి వస్తున్నాయి. వీళ్ళు కూడా క్రొత్త education policyలు choose చేస్తున్నారు. ఇప్పుడు ప్రజల దగ్గరకే విద్య అనే conceptతో చెన్నై IIT, కొత్తగా వచ్చిన తిరుపతి IIT plan చేస్తున్నాయి. విద్యావిధానంలో అనేక మార్పులు తేవాలన్న అభిప్రాయం పెట్టుకున్నారు. Higher education కూడా మనకి ఇక్కడ రావాలి. దానికోసం విదేశాలకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా ఉండాలి.

ఒకసారి IIT రామయ్యగారి ఆహ్వానంతో తెలంగాణాలోని బాసర వెళ్ళాము. అక్కడ మేము మాట్లాడుతూ 'తిరుపతిలో కాంతి – తెలంగాణాలో శాంతి' అని సందేశం ఇచ్చాము. ఆంధ్రాకి IIT రావాలని



ఆయనకి కోరిక. అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారికి కూడా చెప్పారు. మొత్తానికి IIT వచ్చింది. Chennai IITలో మనవాళ్ళు చాలామంది చదువుకున్నా, ఇక్కడికే IIT రావటం అనేది మనం సాధించిన ప్రగతి. ఆంధ్రదేశంలో ముఖ్యమైన విద్యారంగంగా తిరుపతి ఉంది. పదికి తక్కువ లేకుండా పెద్ద పెద్ద విద్యాసంస్థలు ఉన్నాయి. Medical కాలేజీ, వేదిక్ సైన్స్ యూనివర్సిటి, ఆయుర్వేదం యూనివర్సిటి, సంస్కృత యూనివర్సిటి లాంటి ఎన్నో మంచి విద్యాసంస్థలు తిరుపతి చుట్టుప్రక్కల ఉన్నాయి. ఒకప్పుడు చెన్నై ఎంత పెద్ద విద్యావ్యవస్థలకు నిలయమో ఇంచుమించు అలాగే తిరుపతిని develop చేస్తున్నారు. ఇక్కడ IIT ప్రారంభించాలని నివేదిక పంపించినప్పుడు temporary arrangement లాగా అనుకున్నా ఆ temporary అనేది కూడా ఘనంగా ఉండడానికి మంచి భవన నిర్మాణం చేసి, 35 ఎకరాలలో మంచివసతిగా standard IIT సంస్థను నిర్మాణం చేయడం జరిగింది. Finance Minister దగ్గర Secretaryగా చేసిన గీతాకృష్ణ అనే ఆయన విద్యాసంస్థలు ప్రారంభదశలోనే మంచి క్వాలిటీతో సౌకర్యాలు కలిగి ఉండాలి అని చెప్పారు. అట్లాగే తిరుపతి IIT ప్రారంభించిన సమయంలోనే మంచి సౌకర్యాలతో ఉన్నది. మంచి professors రావాలి, students రావాలి అన్నప్పుడు మంచి నమ్మకం కలిగించే విద్యావిధానంతో ప్రారంభం జరిగింది. Students పెరిగినా Structure expansionకి కూడా మంచి Master Plan తో సిద్ధం చేశారు. త్వరలో కేంద్రప్రభుత్వం ద్వారా లోకార్పణం కార్యక్రమాలు జరుగుతాయని మా ఆకాంక్ష.

దేశంలో రెండు విధాలైన విద్యలను కూడా మనం పోషించాలి. మనస్సుకి హితాన్ని, ధైర్యాన్ని, మంచి ఆలోచనని ఇచ్చే literature, music, art, వేద, ఉపనిషత్తులు, తత్త్వశాస్త్రం, లాంటి భారతీయ కళలను నేర్పిస్తూ ఉండాలి. దానిని సత్సంకల్పం, సత్య సంకల్పం, ధృడ సంకల్పం, ఆత్మ విశ్వాసంతో కూడిన చదువుగా పరిగణించాలి. పరస్పర విశ్వాసంతో కూడిన పరివార వ్యవస్థ, mutual understanding, ఈశ్వర విశ్వాసంతో కూడిన వ్యవస్థను తయారు చేయాలి. రెండోది 'క్షణశః కణశ్చైవ విద్యాం అర్థంచ సాధయేత్' (ప్రతి క్షణము విద్యను ఒకొక్క కణంగా ధనాన్ని ఆర్జించాలి.) waste లేకుండా waste management అని కూడా వచ్చింది ఈ రోజుల్లో. timeని resourcesని labని waste చెయ్యకూడదు వంటి మంచి మాటలు చెప్తూ, దానిని ఇతర పరిశోధన సంస్థలు, ప్రైవేటు సంస్థలు కూడా వాడుకోవచ్చని మంచిమాట చెప్పారు. గోడ కట్టాల్సిందే. మన సొమ్ము కాపాడుకోవడా నికి గోడ కట్టడం న్యాయం. కాని ఆ గోడ లోపల



ఉండే విషయాలు ప్రజలకు కూడా ఉపయోగపడాలని ఇలాంటి ఆలోచన చేశారు. విదేశం నుంచి విద్యార్థులు ఇక్కడకి వచ్చి చదివే విధంగా మన economic policyని, education policyని, మన foreign relationsని మార్చుకోవాలి. అనేక భాషలు, నమ్మకాలు, సౌకర్య – అసౌకర్యాలు ఉన్న దేశం మనది. ఒకచోట desert, ఇంకొక చోట చూస్తే floods, ఒకచోట చూస్తే ఎండ, ఇంకో చోట చూస్తే చలి, అలా శీతోష్ణపరంగా, ఆర్థికపరంగా, ఎన్నో బేధాలు ఉన్న దేశం ఇదొక్కటే. ధర్మం, సంస్కృతి, శాంతి, సంకల్పాలు ఈ దేశానికి రక్ష. సౌజన్య సంకల్పంతో ఉండే ఈ దేశం మంచిస్థితిలో ఉంటే విశ్వంలో నాగరికత పెరుగుతుంది. Human values పెరుగుతాయి.


ప్రస్తుత స్థలంలో ఇటు తిరుపతి వేంకటేశ్వరస్వామి, అటు శ్రీకాళహస్తీశ్వరస్వామి, (కొత్తగా కట్టిన గాలిగోపురం) స్వర్ణముఖీ నది ఉన్నాయి. ఇక్కడ అమ్మవారి పేరు జ్ఞానప్రసూనాంబ. అంటే జ్ఞానాన్ని, జ్ఞానపుష్పాన్ని ఇస్తుంది. మీరు IIT అనే జ్ఞాన పుష్పాన్ని జ్ఞాన ప్రసూనాంబకి సమర్పించే విధంగా ఉన్నారు. మరోవైపు పద్మావతి అమ్మవారు. ఇలాంటి మంచి పర్యావరణంలో IIT పక్కనే సైన్స్ కోసం మంచి సంస్థ వస్తోంది అని ఇప్పుడే చెప్పారు. (Indian Instituteof Science)

అలా విజ్ఞానం అనేది మనకి అవసరమైన విషయం. ధర్మం,

సంస్కృతి అని మేము మా కర్తవ్యాన్ని చేస్తున్నా విజ్ఞానం అనేది అన్నింటా వాడుకోవచ్చు. పూలు, పండ్లు కూరగాయలు, అడవులు, పంటలు ఇలా ప్రతిదానికి విజ్ఞానం అవసరం. మన ధర్మం, సంస్కృతికి, విజ్ఞానం అడ్డుకాదు, వ్యతిరేకం కాదు. Indian culture అన్నింటిని కలుపుకొని వెళుతుంది. తిరుపతిలో స్థాపించిన ఈ సంస్థ అందరికీ ఉపయోగపడి మంచి భుక్తి, భక్తి, భావన, బాధ్యత నేర్పించాలని మా కోరిక. సామాన్య విషయాలలో కూడా బాధ్యతలను స్వీకరించి అందరూ కలిసి ఉండి, కొత్త విజ్ఞానానికి నాంది పలకాలి. ఒక కొత్త ఉత్పత్తి వచ్చిన తర్వాత దానిని మరింత మెరుగుపెట్టటానికి మరిన్ని పరిశోధనలు చేస్తారు. దానిని Advance technology అంటారు. సంస్కృతంలో ఒకమాట చెప్తారు. 'అభియుక్త తరః గన్విహి అన్యధే ఉపపాద్యం' అభియుక్త అంటే గొప్పవాడు. జ్ఞానం ఎక్కడా ఆగిపోదు. నిరంతర పరిశోధనలతో improved versions వస్తూనే ఉంటాయి. అలాంటి పద్ధతిలో మనం ఈ Science ని develop చెయ్యాలి.

ఇదివరకు సంస్కృతం, Culture మీద ఎక్కువ సమయం కేటాయించాం. గత 15 సంవత్సరాల ముందైతే Industries బాగా ఉండేవి. ఆ రోజుల్లో మేము హైదరాబాద్ వచ్చినప్పుడు industry research centreకి వెళ్ళాము. అప్పట్లో Industry needs కూడా కేంద్రం చూసేది. ఇప్పుడు ఆత్మనిర్భర్ భారత్ అంటున్నాం. మన ఆత్మనిర్భర్ భారత్‌కి ముఖ్యంగా సైంటిస్టులు బాగా ఉపయోగపడతారు. ప్రజల యొక్క ఆరోగ్యపరమైన, వ్యాపారపరమైన, technology పరమైన అవసరాలు తెలుసుకుంటే సమాజానికి ఉపయోగపడతారు. Through technology ప్రజలకు ఏం చేయగలమో చూడాలి. ఇదే మేము గుడిలో ఇదే చెబుతూ ఉంటాం. మంత్రం, ప్రార్థన, విజ్ఞానం ద్వారా మానవసేవ చేయడానికి మనం ముందుకు రావాలి. మన పూర్వ రాష్ట్రపతి A.P.J అబ్దుల్ కలాంగారు కంచిలో మంచి social service చేసేవారు. రాష్ట్రపతి కావడానికి ముందు మంచి మంచి విత్తనాలు తీసుకొని వచ్చి రైతులకి ఇచ్చేవారు. అలా సమాజ స్పృహ అనేది మన సంస్కృతిలోనే ఉంది.

1934లో శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు కాశీయాత్రకి వెళ్ళారు. మన భారతీయ దాతృత్వంతో ప్రారంభించిన సంస్థ బెనారస్ హిందూ యూనివర్సిటి. అప్పుడు శ్రీ మదన్ మోహన్ మాలవ్యగారు స్వామివారికి సంస్కృత పద్యాలు చెబుతూ స్వాగతం పలికారు. భవిష్యత్తులో భారతీయ యువత ఎలా ప్రవర్తించాలి ? విజ్ఞానపరంగా, సమాజసేవాపరంగా, ఆధ్యాత్మికంగా ఎలా ఉండాలని కొన్ని మంచిమాటలు చెప్పారు. వాటిని ఇంగ్లీషులోకి కూడా తర్జుమా



చేసి మఠం నుండి పబ్లిష్ చేశాము. అది కూడా అందరికీ అందుబాటులో ఉండేలా ప్రయత్నాలు చేయాలి. దేశ స్వాతంత్ర్యానికి ముందు 13 సంవత్సరాల ముందు (1934–35) వారి 60వ సంవత్సరంలో స్వామివారు దీర్ఘదర్శనంతో భవిష్యత్తు గురించి విశ్లేషించారు. ఇప్పుడు మనం inclusive growth అంటున్నాము. ఆ విషయాన్ని స్వామివారు ఆరోజే చెప్పారు. "మీరు భక్తిగా ఉండండి, సైన్స్‌లో కొత్త విషయాలు కనుక్కోండి, ఆత్మశాంతితో మీరు పనిచెయ్యండి. మీరు ప్రజాసేవ కూడా చెయ్యగలరు. అందరికి మంచి చేయ్యండి. publicతో disconnect అవకూడదు. ఏకాంతం అనేది తపస్సు. సంసారిక జీవితంలో శాంతంగా ఉండాలి. అయస్కాంతంలా ఉండాలి. పని ఆకర్షణగా చెయ్యాలి. ప్రజలకు కావాలిసిన కొత్త పనులు, అలవాట్లు ఉత్సాహవంతంగా చేయాలి."



Sri Mahaswami at a public reception in Varanasi with Maharaja and Yuvaraja at Kasi - 1934``

ఈ ప్రాంగణం మంచి పథకాలతో పుష్టికరమైన ఆహారం, మంచినీళ్ళు, గాలి, చక్కని పర్యావరణంలో ఉన్నది. ఈ సంస్థ దైవభక్తి, దేశభక్తి, రాష్ట్రభక్తికి ఆదర్శంగా, మంచిబలంగా ఉండాలి.

పూర్వం కొందరు రాజులు స్వయంవరానికి వెళ్ళారుట. అక్కడ యుద్ధ పరిస్థితి వస్తే సమ్మోహనాస్త్రం వేస్తారు. సమ్మోహనాస్త్రం వేస్తే అందరూ నిద్రపోతారు. సమ్మోహనం అంటే ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా మనం విజయం సాధించడం అన్నమాట. రెండవవ విషయం అహింస. యుద్ధంలో విజయం అనేది ఎదుటి వాళ్ళకి ఇబ్బంది కలిగించకుండా, వారి చేత మనం ఇబ్బంది పడకుండా విజయం సాధించడం. దేశంలో చాలా collegeలు ఉన్నాయి. చాలా బరువు బాధ్యతలు ఉన్నాయి. ఈ బరువు, బాధ్యతలు మనం సరిగ్గా అర్థం చేసుకుని అందరి సహకారంతో నెరవేర్చాలి. 'సంఘే శక్తిః కలౌ యుగే' అంటారు. కలియుగంలో అందరూ ఐకమత్యంగా ఉండి చేయవలసిన పనులు ఉన్నాయి. మన దేశ Borderలో, దేశంలో లోపల, చేయవలసిన పనులు చాలా ఉన్నాయి. అన్నింటికీ కూడా మీరు మంచి సంకల్పంతో చేయాలి.



Sri Mahaswami with His Highness, the Maharaja of Kasi - 1934

(సాధారణంగా ప్రజలు రెండు రూపాయలు తక్కువ అయితే ఆ బొమ్మను కొనేస్తారు. ఆ బొమ్మలు ఎక్కడో విదేశం నుంచి వస్తాయి. భారతీయ స్వరూపం దాంట్లో ఉన్నా ఎక్కడ దానిని తయారు చేశారో ఆ స్వరూపం కూడా కొద్దిగా కనిపిస్తుంది. కాని రెండు రూపాయలు



తక్కువ అని అక్కడ కొనిపిస్తారు.) అందుకని affordable cost, accessibilityలో మన నిర్ణయాలు ఉండాలి. e-commerce, Eco friendly అంటున్నాము. చాలా మంచి విషయాలు మనం చెబుతున్నాము. కాని అలా చెయ్యాలంటే ధృడసంకల్పం, ఐకమత్యం నిరంతర కృషి కావాలి. మనకు విదేశాలతో సత్సంబంధాలు ఉండాలి. అప్పుడే అన్నీ సాధించగలుగుతాం.

ఆంధ్రదేశానికి విజ్ఞానపరమైన బలాన్ని ఇచ్చే విధంగా ఈ IIT సంస్థ ఉత్తరోత్తరం మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాం. ఇంకా దీనికి మంచి విస్తారం జరిగి 'శ్రేయో భూయాత్ సకల జనానాం' అనే విధంగా భారతదేశం – భారతీయుల గురించి విదేశాల వారికి తెలియజేయాలి. ప్రపంచానికి మనం నేర్పాల్సిన అవసరం ఉంది. మనం కూడా మన గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. కొన్ని సంవత్సరాల ముందు చెన్నై IITలో ఒకసారి Convocation జరిగితే, ఒక Industry వారికి చెప్పి పుస్తకం అచ్చు వేయించి పంపించాం. Indian Literature గురించిన ఆ పుస్తకం Convocationలో వచ్చిన వారందరికీ అందించడం జరిగింది. అదే విధంగా తమిళనాడు Universityలో కూడా చేశాము. మనం చేసే పని భారతీయ అభిప్రాయంతో, శక్తితో, న్యాయపరమైన, ధార్మికమైన ఆశయంతో ఉండాలి. అందరితో మనం compare చేసుకోవలసిన అవసరం లేదు.

మనకు మనమే పోటీ అనే విధంగా ఉండాలి. అలా దేశ గౌరవాన్ని, అభివృద్ధిని, సమైక్యతను మనస్సులో పెట్టుకొని ఈ విజ్ఞానం ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండి, వేంకటేశ్వరస్వామి అనుగ్రహం, జ్ఞానప్రసూనాంబ అనుగ్రహం, కంచి కామాక్షీ అమ్మవారి అనుగ్రహంతో ఈ Indian Instituteof Technology, Tirupati Campus దేశంలోనే మంచి Campusగా అభివృద్ధి చెందాలి అని అమ్మవారిని ప్రార్థన చేస్తున్నాం.

**జయజయ శంకర హరహర శంకర**

## నిజామాబాద్ శ్రీమహాగణపతి దేవాలయంలో

# శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారి అనుగ్రహభాషణం

గురుర్ బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః ॥
ముదాకరాత్త మోదకం సదా విముక్తి సాధకమ్
కళాధరావతంసకం విలాసిలోక రక్షకమ్ ।
అనాయకైక నాయకం వినాశితేభ దైత్యకమ్
నతాశుభాశు నాశకం నమామి తం వినాయకమ్ ॥
వక్రతుండమహాకాయ సూర్యకోటి సమప్రభా ।
నిర్విఘ్నం కురు మే దేవ సర్వకార్యేషు సర్వదా ॥

అభీప్సితార్థ సిద్ధ్యర్థం పూజితో యః సురాసురైః ।
సర్వ విఘ్నచ్ఛిదే తస్మై గణాధిపతయే నమః ॥
శ్రుతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయమ్ ।
నమామి భగవత్పాద శంకరం లోకశంకరం ॥
అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం ।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదాన్వహం ॥
సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం ।
అస్మదాచార్య పర్యన్తాం వందే గురు పరంపరాం ॥




ఈ రోజు ఇండోల్, నిజామాబాద్ జిల్లాలోని మహాగణపతి దేవాలయంలో ఈ సభను ఏర్పాటు చేశారు. విఘ్నేశ్వరుని మహిమల గురించి మౌద్గల్యపురాణం ఇంకా అనేక పురాణాలలో ఉంది. 'గణపతి అగ్రహారం' అని తమిళనాడులో ఉంది. 'కాణిపాకం' అని తిరుపతి పక్కన గణపతి క్షేత్రం ఉన్నది. అష్టవినాయక్ మహారాష్ట్రలో ఇంకా ఎన్నో గణపతి పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. 'మహాగణేశ నిర్భిన్న విఘ్నయంత్ర ప్రహర్షితాయైనమః' అని దేవతలైనా సరే వారు ప్రారంభించిన పనులు నిర్విఘ్నంగా జరగాలంటే విఘ్నేశ్వర పూజ చేయడం చాలా అవసరమని పురాణాల ద్వారా తెలుసుకుంటున్నాము. అలాంటి ఈ విఘ్నేశ్వరాలయంలో ప్రజలలో ధర్మ ప్రవృత్తిపై ఆసక్తి కలగటానికి అనేక సత్సంగాలు జరగడం మంచి విషయం.

"ముదాకరాత్త మోదకం"– చేతిలో ఆయన మోదకం పట్టుకొని ఉన్నారు. అంటే ప్రజలకి మోదం, ఆమోదం ఇవ్వడానికి మోదకాలు చేతిలో పెట్టుకున్నారు. 'సదా విముక్తి సాధకం' ఎవరైతే సాధకులు ఉన్నారో వారికి ముక్తిని ప్రసాదిస్తారు. 'కళాధరావతంసకం' అవతంసకం అంటే అలంకారం. శిరస్సులో చంద్రకళను ధరించి ఉన్నారు. 'విలాసిలోక రక్షకం' ఎవరైతే భక్తజనులు ఉన్నారో వారిని రక్షిస్తూంటారు. 'అనాయకైక నాయకం' అంటే ఆయన కన్నా గొప్పవారు ఎవరూ లేరు. ఆయనే ప్రముఖమైన దైవం. 'వినాశితేభదైత్యకం' – ఇభ దైత్యుడు అంటే గజముఖము గల గజాసురుని సంహారం చేసిన ఆయన. 'నత అశుభ నాశకం' అంటే ఎవరైతే నమస్కారం పెడుతున్నారో వారి అశుభాలు, దురాలోచనలు, కష్టాలు, ఆపదలు, సంకటాలు నశింపచేసే శక్తిగలవాడు విఘ్నేశ్వరుడు. అశుభములు వెళ్ళిపోతే వచ్చేది శుభం. 'అశుభాని నా చాచష్టే తానోతి శుభ సంతతిమ్ స్మృతి మాత్రేణయత్ పుంసామ్ బ్రహ్మతన్ మంగళం పరమ్' హిందువులందరము ప్రణవాక్షరాన్ని తోరణంలోనో ముఖ్యమైన స్థలంలోనో పెడతాము. అది మూర్ధన్యమైన, ముఖ్యమైన, గోప్యమైన, శిఖరములాంటి గొప్ప విషయం. మనం ఆ ప్రణవం యొక్క అర్థాన్ని తెలుసుకోవాలి. ఆ ప్రణవ ఓంకారం పరమాత్మ కంఠం నుండి బయటకు వచ్చింది. ఆ ఓంకారం, ఇంకా అథ అనే శబ్దం చాలా మంగళమైన శబ్దాలు. అందుకే భాష్య ప్రవచనం చేస్తున్నవారు 'ఓం అథ' అని చెప్తారు. అంతటి పవిత్రమైన మంత్రం ప్రణవం. ఆ మంత్రం మనకు చాలా ముఖ్యమైనది. 'నతాశుభాశునాశకం నమామితం వినాయకమ్' అలా అశుభం పోతే వచ్చే శుభం అనేది మనకు జ్ఞానం నుంచి మొదలవుతుంది. 'మహాగణేశ పంచరత్నమాదరేణ యోన్వహం ప్రజల్పతి ప్రభాతకే హృది స్మరన్ గణేశ్వరం అరోగతామదోషతాం సుసాహితీం సుపుత్రతాం సమాహితాయు రష్టభూతి మభ్యుపైతి సోచిరాత్' అష్టైశ్వర్యాలను శీఘ్రంగా విఘ్నేశ్వరుడు మనకు ప్రసాదిస్తారు. అలాంటి విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో మనకి వచ్చిన గొప్ప ఉత్తమమైన గ్రంథం 'మహాభారతం'. ఆ మహాభారతమనే గ్రంథం వ్యాసమహర్షులవారు విఘ్నేశ్వరుని అనుగ్రహంతో మనకి ఇచ్చారు. విఘ్నేశ్వరునికి ముందు రెండు దంతాలు ఉండేవి. దాని నుంచి ఒక దంతాన్ని ఆయన పరిత్యాగం




చేసి దానితో మహాభారతాన్ని వ్రాసి ప్రజలకు అందించారు. అంటే సామాన్యప్రజలకు మంచి కలిగించాలంటే దేవతలు కూడా కిందకు దిగి వచ్చి వారి యొక్క ఆనందాన్ని, సౌకర్యాలను వదిలిపెట్టి ప్రజలకు మంచి చేస్తున్న సనాతన ధర్మం ఇది. అలా అప్పటి నుండి ఏకదంతునిగా ఉన్నారాయన. అలాంటి మహాభారతంలో ధర్మం ముఖ్యంగా చెప్పబడింది. కథలు అనేకం ఉన్నాయి. బంధుత్వం, పెళ్ళి, యుద్ధం, ఆస్తి, అధికారం విషయాలన్నీ మహాభారతంలో వస్తాయి. కాని ప్రసంగాత్ అనే ముఖ్యవిషయం మధ్యలో వచ్చి సందర్భానుసారంగా చెప్పబడేది. మనం బయట ప్రచారంలో ప్రసంగం అంటే ప్రధానం అనుకుంటాము కాని ప్రసంగం అనేది అవాంతరం. Incidentally అనేది ప్రసంగం అయితే ప్రసంగాత్ అనేది ముఖ్యవిషయం అవుతుంది. ఉదాహరణగా భోజనం మధ్యలో స్వారస్యం కోసం కొంచెం పప్పు వేస్తే బాగుంటుంది, కూరగాయలు వేస్తే



బాగుంటుంది, మిరపకాయ ఉంటే బాగుంటుంది అనుకునేలాంటిది ప్రసంగమంటే.

యుద్ధం గురించి, ఆస్తి, అధికారాల గురించి ఇప్పుడు అడ్వకేట్లు ఉన్నారు. అప్పుడప్పుడు ఒక పరిష్కారం అవుతుంది. ఆ రోజుల్లో పరిష్కారం, ఈ రోజుల్లో పరిష్కారం వేరు. కానీ జీవితం సార్థకం కావాలి అంటే మనం చెయ్యగలిగే మంచి పనులు ఏవంటే దేనికి దూరం ఉండాలి ? దేనికి దగ్గరగా ఉండాలి ? అనే విషయాన్ని మహాభారతంలో తెలుసుకోవాలి. పద్ధెనిమిది పర్వాలు 'ప్రతి పర్వ రసోదయః' అన్నట్లుగా ఉంటాయి. శాంతి, స్త్రీ, అనుశాసనిక, ఇలా అనేక పర్వములు ఉన్నాయి. ఒక్కొక్క భాగంలో కూడా మంచి స్వారస్యమైన, మాధుర్యమైన మనకు అవసరమైన విషయాలు ఉన్నాయి. అందుకని 'ప్రతి పర్వ రసోదయః' అంటారు. వెదురు దండంలో మధ్యలో పర్వ (కణుపు) అంటారు అలా చెఱుకులో మధ్యలో కణుపు ఉంటుంది. చెఱుకు మధ్యలో ఉండే ఒక్కొక్క కణుపులో ఒక్కో మాధుర్యం ఉంటుంది. కింద, మధ్యలో పైన ఇలా అనేక రసాలు ఉంటాయి. మొత్తానికి 'రసో వై సహః' అని ఒక స్వారస్యమైన ఎస్సెన్స్ ఉంటుంది. మనం జీవితంలో అధ్యయనం వల్ల రాని పరిపక్వత అనుభవం వల్ల వస్తుంది. అధ్యయనం కూడా 5, 6 సంవత్సరాలు చదివి పూర్తి అయ్యింది అనేది కాదు. 'ఆచార్యాత్ పాదమాదత్తే పాదం శిష్యః స్వమేధయా పాదం సబ్రహ్మచారిభ్యః పాదం కాల క్రమేణ చ' అంటే అధ్యయనం చేస్తే కొంత అర్థం అవుతుంది. తరువాత పారాయణం చేస్తే కొంత అర్థం అవుతుంది. తరువాత ప్రసంగాలు చేస్తే ఇంకొంత, పెద్దవయస్సు వచ్చే కొద్దీ జీవితంలో మనకు ఏర్పడే సంసార బంధం నుంచి మనం నేర్చుకునే విషయాలు అనేకం. ఎక్కడ నిదానంగా ఎక్కడ వేగంగా ఉండాలో, ఎక్కడ మౌనంగా ఉండాలో, ఎలా మాట్లాడాలో ఇవన్నీ కూడా పుస్తకాలు నేర్పించేవి కావు. మన అనుభవం, పరిసరాలు, పరివారం, పరిపక్వత, నేర్పిస్తాయి. అలా విద్యలో క్రమశిక్షణ, క్రమేణ శిక్షణ ద్వారా మనం ఒక జ్ఞానాన్ని పొందుతున్నామో, అలా ధర్మంలో కూడా మనకి జ్ఞానం కలగడానికి ముందు మనకు కర్మయోగం కావాలి. ఆ కర్మయోగమే ఇంటిలో మనం దీపాన్ని వెలిగించడము. కొందరు పుట్టినరోజు అంటే తెలియక దీపాన్ని ఆర్పేస్తారు. పుట్టినరోజు వచ్చినప్పుడు దీప ప్రజ్వలనం చేసి పుట్టినరోజుని ఒక పండుగలా చూడాలి. అంతేకాని కొత్తగా పాశ్చాత్యం అని, ఇదే నాగరికత అని, ఇలా చేస్తేనే మనల్ని గౌరవిస్తారని, అప్పుడే మనం నిత్యనూతనంగా ఉంటామని భావించకుండా, శాస్త్రంలో, సంస్కృతిలో మనం పురాతనంగా ఉండాలి. సైన్స్‌లో, విజ్ఞానంలో

మనం కొత్తవాళ్ళుగా ఉండాలి. ఇప్పుడు లైట్లు లేకపోతే దీపం మాత్రమే పెట్టుకుని ఈ మీటింగ్ అయ్యేదా ? మైకు లేకపోతే అవుతుందా ? అంటే ఏది కొత్తగా వచ్చిందో దానిని ధర్మం కోసం వాడుకోవాలి. సౌకర్యాలు ఉన్నాయని ధర్మానికి సంబంధం లేని మార్గంలో వెళ్ళకుండా ధర్మసహితమైన మార్గంలో నడవాలి. దానికోసం జ్ఞానమార్గమనేది మన అందరి లక్ష్యం, ధ్యేయం కావాలి. 'మిథ్యాజగదధిష్ఠాన ముక్తిదా ముక్తి రూపిణి' అనే విధంగా మనకి ముక్తి రావాలి అనే దానిలో ఏమి సందేహం లేదు. మనం చేరుకోవాల్సిన చోటు అదే. ఎవరెస్టుని చూస్తూ కూర్చుంటే కుదరదు కదా ! నడవాలి, శీతాగ్ని సహించాలి, ఊపిరి నిలవడానికి ప్రాణాయామం చెయ్యాలి, అన్నీ చేస్తే కాని ఎవరెస్టుగాని హిమాలయం కానీ మనం వెళ్ళడానికి వీలుకాదు. దాని కోసం అభ్యాసం, ఆవృతి కావాలి. అలా మంచి విషయాన్ని మనం మళ్ళీ మళ్ళీ చెప్పుకోవాలి. వాల్మీకి 'మరామరామరామరామరామ...' అని రామనామం కూడా ఆయనకు అలవాటు లేనప్పుడు పైవిధంగా అభ్యాసం చేసి మహర్షిగా మారిన విధం మనం తెలుసుకున్నాము.



అలానే అభ్యాసం వల్ల భక్తకన్నప్ప ఈశ్వరుడికి రెండు కళ్ళు సమర్పించాడు. శివానందలహరిలో శంకరాచార్యులవారు కూడా 'భక్తిః కిం న కరోత్యహో వనచరో భక్తావతంసాయతే' అని చెప్పి భక్తి ఉంటే అడవిలో తిరిగే మనిషి కూడా భక్తాగ్రగణ్యుడుగా, భక్తాగ్రేసరుడిగా, భక్తచింతామణిగా అవుతారని భక్తి యొక్క మహాత్మ్యం చెప్పడం జరిగింది. అలా భక్తి, నిత్యకర్మానుష్ఠానం మనల్ని జ్ఞానమార్గంలో ఉన్నతంగా తయారుచేస్తాయి.


సిద్ధం, సాధ్యం అనేవి రెండు విషయాలు. ఆయుర్వేదంలో సిద్ధం, సాధ్యం అసాధ్యం అని మూడు మాటలు ఉంటాయి. సిద్ధం అంటే ఇది తప్పకుండా పనిచేస్తుంది అని, సాధ్యం అంటే పనిచేయవచ్చు అని, అసాధ్యం అంటే ఈ మందుతో పని జరగదు అని అర్థం చెప్తారు. అలా మన ధర్మంలో జ్ఞానమనేది ఎదో కొందరికి పూర్వజన్మ సుకృతం ద్వారా వస్తుంది. వామదేవుడు అనే ఆయన గర్భంలో ఉన్నప్పుడే మంచి విషయాలన్ని తెలుసుకుని, పుట్టడమే జ్ఞానిగా పుట్టారు. 'గర్భయేవ శయనో వామదేవ ఎవం ఉవాచా' అని 'అహం సూర్యశ్చ' అని చెప్తారు. అలా కొందరికి మాత్రమే సాధ్యం అవుతుంది. మంచి విషయాలు తరువాత చేయొచ్చు అని కాకుండా సాధ్యమైనంత త్వరలో మనం చేసుకోవాలి. అది మానవ జీవితంలో మనం తీసుకోవాల్సిన ముఖ్య నిర్ణయం. అందుకే 'శైశవే అభ్యస్త విద్యానాం, యౌవ్వనే విషయైషిణాం, వార్ధకే మునివృత్తీనాం యోగేనాంతే తనుత్యజాం' అని భారతీయ జీవన విధానం గురించి చెప్తారు. ఈ జీవన విధానాన్ని మనకి శాస్త్రాలు నేర్పిస్తాయి. వేదము – వేదానికి సంబంధించిన గృహ్యకారికలు, శ్రౌత, కల్పసూత్రాలు, మను, యాజ్ఞవల్క్య స్మృతులు, ధర్మసింధు, నిర్ణయసింధు మొదలైన పుస్తకాలు మనకి ప్రతి విషయాన్ని నేర్పిస్తాయి. ఎలా లేవాలి, దంతధావనం, స్నానం, పరిషేచనం ఎలా చేయాలి, అన్నం ఎలా వడ్డించాలి అనేవి కూడా నేర్పిస్తాయి.

ప్రాచీన ధర్మంలో స్వధర్మం ముఖ్యమైనది. ఇప్పుడు సమాజంలో Distribution system అనేది ముఖ్యంగా ఉన్నది. ఎంత ఆస్తి, అధికారం ఎవరికి ఇవ్వాలి, మాట్లాడటానికి స్వాతంత్ర్యం, శోభాయాత్రకి స్వాతంత్ర్యం, ఇంకా ఏవేవో స్వాతంత్ర్యములు వచ్చి, స్వాతంత్ర్యం అనే విషయం ఇప్పుడు ముఖ్యమైపోయింది. కొత్తయుగంలో స్వాతంత్ర్యం అంటే ఎవరు నన్ను అడగకూడదు, ప్రశ్నించకూడదు. ఎందుకు ఇలా చేస్తున్నావు, కూర్చున్నావు, చూస్తున్నావు అని ప్రశ్నించకూడదని అనుకుంటారు. ప్రాచీనధర్మంలో ప్రశ్నించటం ఉంటుంది. ఎలా అంటే మనల్ని మనవే

ప్రశ్నించుకుంటాము. మనం ఎక్కడ ఉన్నాము, ఏ మెట్టులో ఉన్నాము, ఎక్కడికి వెళ్ళాలి అని ఆత్మసంశోధనం చేసుకోవాలి. అలా మన ధర్మాన్ని తెలుసుకోవాలి. మనది కఠినమైన ధర్మం కాదు. మార్దవమైనది. మార్దవం అంటే తేలికైన ధర్మం. అయినా తెలివితేటలతో చెయ్యాల్సిన పనులు ఉంటాయి. అందుకని నిత్యకర్మానుష్ఠానం అని పెట్టి ఉదయం నుంచి సాయంత్రం వరకు మనం చెయ్యాల్సిన విధులు తెలియజేశారు. మనం చేయాల్సిన ఉదయాస్తమాన అనుష్ఠానములు కొన్ని ఉన్నాయి. ఉదయం లేవగానే కరాగ్రే వసతే లక్ష్మీః కర మధ్యే సరస్వతీ కరమూలే తు గౌరి స్యాత్ ప్రభాతే కర దర్శనం' అని పద్యాలన్నీ ఇక్కడి భక్తులకు ఇవ్వడం జరిగింది. అలా నిత్య ప్రార్థనలు చెయ్యాలి. ప్రార్థనలు మన కోర్కెలను అక్కడ పెట్టడం కాదు. కోరికలు మనుషులకి ఉంటాయి. పెళ్ళి, పిల్లలు, ఉద్యోగం, ఇల్లు, వాహనం ఇలా కొన్ని అవసరాలు ఉంటాయి. కొన్ని భయంచేత, కొన్ని అత్యాశచేత మరికొన్ని అవసరాన్ని బట్టి ఉంటాయి. కోరికలు చెప్పుకోవటం తప్పు కాదు. ఇచ్చేవాళ్ళ దగ్గర, సానుభూతి చూపించేవాళ్ళ దగ్గర చెప్పుకుంటాము. చెప్పుకోవటం వల్ల ఏమి ప్రమాదం లేదు కానీ భగవంతుని దగ్గర మనం భక్తిని, కర్మానుష్ఠానంలో శ్రద్ధని, తన పాదారవిందాలు చేరుకోవడానికి జ్ఞానాన్ని ప్రసాదించమని ముఖ్యంగా కోరుకోవాలి. అది మన సంకల్పంలో కూడా ఉండాలి. అందుకే 'సమస్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం' అని సంకల్పాలు చెబుతున్నారు. 'జ్ఞానాదేవతు కైవల్యం' అని చెప్పినా ఆ జ్ఞానం కలగడానికి సత్సంగం ముఖ్యం. 'సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం, నిర్మోహత్వే నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః' అని చెప్పి 'నిష్క్రోధా క్రోధశమనీ నిర్లోభా లోభనాశినీ, నిస్సంశయా సంశయఘ్నీ నిర్భవా భవనాశినీ, నిర్వికల్పా నిరాబాధా నిర్భేదా భేదనాశినీ, నిర్నాశా మృత్యుమథనీ నిష్క్రియా నిష్పరిగ్రహా' అని మంచి ఆత్మగుణాలు కలగాలని అమ్మవారిని మనం ధ్యానం చేసుకోవాలి. మనిషిని మంచిమనిషిగా తయారు చేయడమే హిందూ సనాతనధర్మం యొక్క ముఖ్య ఉద్దేశ్యం, ఉపదేశం, సిద్ధాంతం కూడా. 'జంతూనాం నర జన్మ దుర్లభం' అంటారు. అలాంటి దుర్లభమైన జన్మ మనకి వచ్చింది. ఇది దుర్బలమైన జన్మ కాకుండా సులభమైన, ప్రబలమైన, శక్తిసామర్థ్యం గల జన్మగా తయారు చేసుకోవడానికి ప్రయత్నించాలి. మనం నిత్యం చిన్నపిల్లలకి నడవడం ఎలా నేర్పిస్తామో, ఎంతవరకూ మనం పట్టుకోవాల్సిన అవసరం ఉంటుందో, అంతవరకూ మనపట్ల ప్రేమగాను, బాధ్యతగాను, తోడుగాను ఉండి, తగిన సమయం ఇచ్చి మన గురువులు, మహాత్ములు, మహర్షులు, యోగులు, సిద్ధులు ఈ సమాజాన్ని తయారు చేశారు. ఈ సమాజానికి అవసరమైన



ఆయుర్వేదం జ్యోతిష్యశాస్త్రం ద్వారా ఆరోగ్యాన్ని, ఐశ్వర్యం, సంతానం కోసం మంత్రాలను ఇచ్చి, మంత్రానుష్ఠానం కూడా నేర్పించారు. మానవసేవ చేసుకోవటానికి గణేశ అథర్వశీర్షం, శ్రీసూక్తం చదువుకోండి, బిల్వచెట్టు పెట్టండి, అశ్వత్థవృక్షం ప్రదక్షిణ చేయండి. ('మూలతో బ్రహ్మరూపాయ మధ్యతో విష్ణురూపిణే అగ్రతః శివరూపాయ వృక్షరాజాయతే నమః') తులసిపూజ, గడపకు పసుపుకుంకుమ, మామిడి ఆకులతో గుమ్మానికి తోరణం, మంచి శకునాలు ఇలా మనకి చిన్న చిన్న విషయాల నుండి పెద్ద విషయాల వరకు హిందూమతంలో చెబుతారు. మనుషులు అందరూ ఒక విధంగా ఉండలేరు. అప్పుడు ధర్మం 'రుచీనాం వైచిత్ర్యాత్ ఋజుకుటిల నానా పథజుషామ్ నృణామ్ ఏకో గమ్యః త్వమసి పయసామ్' అని చెప్పొచ్చు. మనుషులు రకరకాలుగా కోపంగా, శాంతంగా, అందంగా ఉంటారు. కొందరు అన్నీ మనకే అంటారు. ఇంకొందరు మనకెందుకు అంటారు. ఇట్లా రకరకాల మనుషులు ఉన్నప్పుడు ఎలా అయితే 'సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి' అంటామో అనేక పద్ధతులను చెప్పి ఏ ఒక్క




విధానం ద్వారా అయినా స్వాత్వికంగా అవుతారేమో అని చిన్న ప్రయత్నం చేయడం. భగవద్గీతలో సాత్విక, రాజస, తామస వ్యక్తులని విభజన చేశారు. బజారులో అనేక రకాలైన వస్తువులు ఉన్నట్టుగా వాస్తవము కూడా అనేక రకాలుగా ఉంటుంది. దానికోసం ప్రమోషన్ సిస్టమ్ అని ఒకటి తయారు చేశారు. తామసాన్ని ఒప్పుకున్నారంటే దాన్ని వస్తుతత్త్వం (గ్రౌండ్ రియాలిటీ) అంటారు.

ప్రస్తుతం భూమిలో ఉండే సత్యం ప్రాతిభాసిక సత్యం. (ప్రాతిభాసిక సత్యాన్ని వ్యావహారిక సత్యం అని కూడా అంటారు) మనం ఇప్పుడు తెలుసుకోవాల్సింది పారిమార్ధిక సత్యం. మూడు కాలాలలో కూడా క్షయం, మార్పు లేకుండా ఎప్పుడూ నిత్య శాశ్వతమైన సత్యం పారమార్ధిక సత్యం. అదే పరమాత్మ అని మనం తెలుసుకోవాలి. దానినే మనకు శంకరాచార్యులవారు 'పరబ్రహ్మ లింగం భజే పాండురంగం' అని చెప్పారు. అలా పరమాత్మ విజ్ఞానం వచ్చేంత వరకు మనం ఈ అభ్యాసం, ఆవృతి, అధ్యయనం చేస్తూ ఉండాలి. ఏదో ఒకరోజు వచ్చే జ్ఞానం కోసం మనల్ని మనం తయారు చేసుకోవాలి. అందుకు మనకి మంచి శ్రద్ధ ఉండాలి. ఆ శ్రద్ధ ఉండాలని మనకి సామవేదం చెబుతున్నది. మనలో నాలుగు స్వభావాలు ఉండాని, మనం ఈ సంసార సాగరం, కష్టనష్టాలు, అంధకారం, అహంకారం, అశ్రద్ధ, ఆడంబరం నుంచి బయటపడాలంటే 'సేతూం ...స్తర సేతూం... స్తర సేతూం...స్తర' అని సామవేదంలో ఉంటుంది. మన కంచి పెద్దస్వామివారి దగ్గరికి వచ్చే సామవేద పండితులు దీనిని చెప్పేవారు. 'అక్రోధేన క్రోధం' కోపాన్ని మనం జయించాలంటే మనకు కోపం రాకుండా ఉండాలి. అలాగే పక్కన వాళ్ళు కూడా ప్రత్యోదనం (ప్రొవోక్) చేయకూడదు. మనం ఆచరించడానికి మన పక్కవాళ్ళు కూడా సహకరించాలి. కుటుంబంలో భార్య, భర్త పరస్పరం మంచిపనికోసం సహకారంగా ఉండాలి. తల్లీతండ్రి, పిల్లలు ధర్మప్రకారం ఉండాలి. ఒకరినొకరు అర్థం చేసుకోవటం, ఓర్పు, ధర్మం, ధార్మికమైన ఆలోచనలతో ఉండాలి. ఇంకెవరో వచ్చి ఇది ప్రమాదం అని చెప్పే బదులుగా ఋషులు, వేదం, ధర్మం ఇలా చెబుతుందని వివరిస్తే ధర్మంపై ఉండే గౌరవం, నమ్మకం, ఆసక్తి ద్వారా మనల్ని మనం నియంత్రించుకుంటాం. అందుకని నమ్మకం, జ్ఞానం అనేవి చాలా ముఖ్యం. ఎవరైనా ఇది పుణ్యం కాదు పాపం చేయకూడదు అని చెప్తే మనకు చాలా కోపం వస్తుంది. అందుకని ధర్మ విద్యను ముందు నుంచే మనం నేర్పించాలి. ఈ సేతు సామగానంలో 'అక్రోధేన క్రోధం' 'శ్రద్ధయా అశ్రద్ధామ్' అంటే – కొందరు ఎలా జరిగినా ఫర్వాలేదు ఏదో జరిగిపోతోంది కదా అనుకుంటారు. ఒక్క కార్యక్రమం చేసినా, మాట్లాడినా శ్రద్ధగా చేయాలి. పేరు కోసమో లేదా చెయ్యాలి అన్నట్లు కాకుండా చక్కగా చెయ్యాలి. అది Hand writing అనుకోండి, మాటలు, ఆతిథ్యం ఏదైనా సరే మనం చిన్నా పెద్దా ఏపని చేసినా, వంట ఇల్లు శుభ్రం చేసినా శ్రద్ధగా చేయాలి. ఎవరు వచ్చి చూడరు, భర్త తప్ప, ఆయనకు భోజనం పెడితే సరిపోతుంది కదా. వంట ఇల్లు మన ఆధీనంలోనే ఉంటుంది, దీన్ని శుభ్రంగా పెట్టుకోవాలా? అని కాకుండా మన ధర్మం, కర్తవ్యం పాటించాలి. ఇంకెవరు supervice చేసినా చెయ్యకపోయినా మన మనస్సు పర్యవేక్షిస్తుంది. అలాంటి ఆత్మ నియంత్రణ మన ధర్మంలో ఉంటుంది. 'శ్రద్ధయా అశ్రద్ధామ్' అశ్రద్ధను గెలవాలంటే, జయించాలంటే మనం శ్రద్ధగా ఉండాలి. కోపాన్ని జయించాలి. శాంతంగా ఉండాలి. 'దానేన అదానమ్' దానం అనేది గొప్ప విషయం. ఇండియాలో ఇన్ని ధర్మాలు జరుగుతున్నాయంటే అన్నీ గవర్నమెంట్ ఇచ్చినవి కావు. ఈ రోజుల్లో ప్రభుత్వం అంటారు కాని ఆ రోజుల్లో మహారాజులు ఇచ్చేవారు. ధర్మాలు ఎందుకు చేయిస్తారు అంటే పేదరిక నిర్మూలనం అంటారు. అది మంచి విషయమే. దానితో పాటు మనుషులను సోమరిగా చేయకుండా ఉండాలి. అది కూడా ముఖ్యం. ధర్మం అంటే దానం మాత్రమే కాదు. దానం కూడా ధర్మం. అంతే

కానీ ఏదో ఆడంబరం కోసమో, నిధులు వస్తాయనో చెయ్యకూడదు. ఉచితంగా చెయ్యాలి. ఉచితాలు తప్పు కాదు కాని ఉచితాలు ఉన్నతంగా ఉండాలి. అలా మనం హిందూధర్మాన్ని పాటించాలి. దీంట్లో 'దానేన అదానమ్' అదానమ్ అంటే ఇవ్వకుండా ఉండటం కాదు. ఇవ్వాలి. 'లోక యాత్రా విధాయిని' 'సంసారపంక నిర్మగ్న సముద్ధరణ పండితా' – అమ్మవారు పండిత. (పండ అంటే జ్ఞానం, పాండా అంటే జ్ఞానం కలిగిన పండితులు అని శంకరాచార్యులవారు చెప్పారు) సంసారమనే బురద, మట్టి, ఇసుకలో పడి, ఏది చెయ్యాలో తెలుసుకోలేక, సహకారం లేకుండా గజేంద్ర మోక్షం మనకు సాధ్యమా? కాని మామూలు జీవితంలో మన ప్రయత్నమైతే చెయ్యాలి. ప్రార్థన చెయ్యాలి. ఆ సందర్భంలో 'దానేన అదానమ్' చెప్పాము. ఒకరు పైకి రావాలంటే ముందు మనం కొంత సహకరించాలి. దానికే ఇప్పుడు Loans అనేవి ఉన్నాయి. Loan అంటే ఆ వ్యక్తి ఏకాకి కాకుండా (Alone)సహకరించేవి. ఆ Loans సరిగ్గా వాడుకుంటే సింహం (Lion) అవుతాడు.

మనం పుట్టినప్పుడే మనకి మూడు అప్పులు ఉంటాయి. దేవతాఋణం, ఋషిఋణం, పితృఋణం అని మూడు ఉంటాయి. ఇలాంటి ఋణాణి త్రీన్ యాపాకత్య' అని ఈ మూడు అప్పులను తీర్చి జన్మ చరితార్థం అవ్వటానికి మనం ప్రయత్నించాలి. దానికోసం దానం అవసరం. అది విద్యాదానం, అన్నదానం, చలివేంద్రం, మండపారాధనం, నీడకోసం చెట్లు నాటడం, ఏదైనా కావచ్చు. ఎవరికి మనం సహకరించాలో వారికి సహకరించినప్పుడు మనకి పుణ్యం వస్తుంది. 'ఆత్మతృప్తస్య మానవః ఆత్మన్యేవచ సంతుష్టః' అని ఆత్మతృప్తి కలుగుతుంది. ఆ ఆత్మతృప్తిని మనం సాధించాలంటే దానం చెయ్యాలి. ఆ దానంలో ధర్మానికి ముఖ్యమైన స్థానం ఉండాలి. ఏదో సహకారం పేరుతో మనం లేనిపోని పనులు చెయ్యకుండా ఏది చేస్తే ధర్మానికి అనుగుణంగా ఉంటుందో ఉదాహరణకి వేదపాఠశాలలు, గోశాల, సత్రం, 'అన్నం బహు కుర్వీత' అని అన్నదానంలాంటి కార్యక్రమాలు చెయ్యాలి.





**'అన్నపూర్ణే సదాపూర్ణే శంకర ప్రాణవల్లభే**

**జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాందేహీ చ పార్వతీ'**

'పాత్రః కిం అన్నదానే' అన్నం పెట్టాలంటే ఎవరు పాత్రులు అని శంకరాచార్యులవారు అడిగారు. 'క్షుధితం' అంటే ఎవరికి ఆకలి ఉందో వారికి అన్నదానం ముఖ్యంగా చెయ్యాలి. ఇస్తాం, ఇస్తాం అని చెప్పి ఏదో ఒకటి చెయ్యడం కాదు ఎక్కడ అవసరం ఉందో దానిని గుర్తించి చెయ్యాలి. అలాంటి ధర్మాన్ని చూపించడంలో ఏ ప్రదేశంలో, ఏ విషయంలో వెనుకబడి ఉన్నాము? ఏది చేస్తే రేపు మంచి జరుగుతుంది? వెంటనే మనకి అవసరమైన విషయాలు ఏవి ?అన్న విషయాలలో ప్రణాళిక అవసరం. అలాంటి ధార్మికమైన ఆలోచనలు మనలో కలిగి ఉండి దాతృత్వం ఎవరిలో ఉన్నదో వారి నేతృత్వంతో కలిసి మంచి విషయాలను ఆలోచించి దానం చెయ్యాలి. ఆ దానం చేస్తున్నప్పుడు చిరునవ్వుతో చేయాలి అని శంకరాచార్యులవారు చెప్పారు.

'విత్తం త్యాగ సమేతం' – డబ్బు ఉంటే త్యాగం సమేతంగా ఉండలి.

'జ్ఞానం అగర్వం' – జ్ఞానం గర్వం లేకుండా ఉండాలి.

'క్షమాన్వితం శౌర్యం'–శౌర్యం, పరాక్రమం ఓర్పుతో ఉండాలి. సమయం సందర్భం చూడకుండా పరాక్రమం వాడితే అది వ్యర్థం అవుతుంది. లేకపోతే అది మనకే శత్రువు అవుతుంది. అలా కాకుండా ఆ శౌర్య పరాక్రమాలని అవసరాన్ని బట్టి ధర్మాన్ని బట్టి, సమాజహితం కోసం వాడటం అనేది ముఖ్యమైన విషయం.

'దుర్లభమేతత్ చతుర్భద్రం విత్తం త్యాగ సమేతం దానం ప్రియవాగ్సహితం' మంచి మాటతో కలసిన దానం ఫలితాలను ఇస్తుంది. మహాబలిచక్రవర్తి త్రివిక్రమస్వామికి వామన అవతారంలో పాదపూజ చేసి గౌరవించి, మాలలు వేసి దానం ఇవ్వడం భారతీయ సంస్కృతి యొక్క గొప్పతనం. పేదరిక నిర్మూలనం అని అక్కడక్కడ ఉన్నా అందరినీ భగవత్ స్వరూపంగా చూసి ప్రేమతో వ్యవహరించడం అనేది మన సనాతనధర్మంలో ఉన్న గొప్పతనము. 'దానం ప్రియవాక్సహితం' అని మంచిమాటలు చెప్పి, చందనం, తాంబూలాలు ఇచ్చి, సత్కారం చేసే ధర్మం హిందూసనాతనధర్మం. ఇప్పుడు Positive thinking అంటారు. సకారాత్మకమైన అనుకూలాత్మకమైన

ఆలోచనలు, నిర్మాణాత్మక ప్రయోజనం ఉండే ఆలోచనలు ధర్మంలో ఉన్నాయి. నశింపజేసేది కాదు మన సంస్కృతి. మన సనాతనధర్మం యొక్క విశిష్టత, ఉత్పత్తి, ఉపయోగం, ఉద్దేశ్యం మనకు చాలా ముఖ్యం. ఇప్పుడు సమాజంలో Utilisation certificate అంటున్నారు. ఎవరైనా దానం ఇస్తే దేనికి వాడుతున్నామో అని సంతకం పెట్టమంటారు. ఎవరినైనా అడగడానికి సంకోచం ఉండాలి కాని ఇవ్వడంలో సంకోచం ఉండకూడదు. ఈ రోజుల్లో Management courseలో Supply chain అనే దాన్ని ముందే సరిగ్గా నిర్ణయం చేసినది మన ధర్మమే. అందుకని

'యాచమాన జన మానసవృత్తేః పూరణాయ భువి జన్మనయస్య తేన భూమి రతి భారతీయం న ద్రుమైః నగరిభిః న సముద్రైః' రామాయణం నందు సుందరకాండలో ఆంజనేయస్వామి



మహేంద్రగిరి నుంచి శ్రీలంక వెళుతున్నప్పుడు ఆయన ప్రయాణ వేగానికి గాలికి దేవదారు చెట్లు, వటవృక్షాలు అన్నీ కింద పడిపోయినాయి, దీని వల్ల ఆ యుగంలో ఏమేమి చెట్లు ఉండేవో మనం తెలుసుకోవచ్చు. అంటే కావ్యాన్ని, పురాణాలని మనం చదివినప్పుడు మనదేశం యొక్క భూగోళం, పంచభూత పరిస్థితి, ఆచారం, ఇవన్నీ కూడా తెలుసుకుంటాము. ఇండియన్ హిస్టరీ గురించి కొత్తగా కొందరు ఇంగ్లీషులో పుస్తకం రాస్తే తెలుసుకోవటం, లేదా శిలాఫలకాల ద్వారా తెలుసుకోవడం అనేవి ఉన్నా మనదేశం యొక్క చరిత్ర తెలుసుకోవడానికి పురాణాలు, కావ్యాలు చదవాలి. కాళిదాసు కావ్యం లాంటివి చదివితే మన లైఫ్ స్టైల్ ఏమిటి అని తెలుస్తుంది. స్టైల్ లైఫ్ గురించి ఆలోచిస్తాము. లైఫ్ స్టైల్ ఏమిటో నేర్పించేది కావ్యాలు. తెలుగులో ఉన్న కావ్యాలు, శతకాలు, పురాణాలు, స్థలపురాణాలు తెలుసుకోవాలి. Managementని తెలుసుకోవడానికి French యొక్క సామెత, German యొక్క సామెత, English వాళ్ళ కథలు లాంటివన్నీ తెలుసుకోవచ్చు. కానీ మనం ప్రధానంగా భర్తృహరి నీతిశాస్త్రము సుభాషిత భాండాగారము, విదుర నీతి యక్షప్రశ్నలు, సకుమారక ఉపదేశము అలా అనేక ఉపదేశాలు తెలుసుకోవాలి. భగవద్గీత, అష్టావక్రగీత, ఉద్ధవగీత ఇంకా అనేక గీతలు మనకి లక్ష్మణరేఖని చూపిస్తాయి.

ఈ ప్రపంచానికి Charity Management నేర్పినదే మనదేశం. సంపాదించండి, సేకరించండి, సద్వినియోగం చేయండి అని నేర్పినది మన సనాతనధర్మం. మనకి దానం ఇవ్వడము, స్వీకరించడం రెండూ ముఖ్యం. (సత్పాత్రే వినియోగం) మంచి అబ్బాయిని చూసి అమ్మాయిని ఇవ్వాలి. చదువు, ఉద్యోగం చూసినా మంచి వంశము, భక్తి, సదాచారము, స్వభావము అనేవి ముఖ్యంగా చూడాలి. 'అశోచ్యాహి పితుః కన్యా సత్ భర్త్రే పతిపాదితా' మంచి అబ్బాయికి ఇచ్చి మనం కన్యాదానం చేసినప్పుడు మనకి చింత అనేది ఉండదు అని కాళిదాసు చెబుతున్నారు.

'యాచమాన జన మానసవృత్తేః పూరణాయ భువి జన్మ న యస్య' మహాదానములు అని కొన్ని ఉన్నాయి. దశదానం, మహాదానం అని చెప్తారు పురోహితులు. దీపదానం, లవణదానం, ఆజ్యదానం, చందనకాష్ట దానం, నారికేళదానం, పుస్తకదానం నవధాన్యదానం ఇవన్నీ అనేకమైన దానాలు. అవి చిన్నవో, పెద్దవో కావచ్చు. దానం ఉద్దేశ్యం పేదరిక నిర్మూలనము, మంచి వ్యక్తులను సత్కరించడం, సౌజన్యం, ఒకరిని ఒకరు చూసి అసూయ, ద్వేషం లేకుండా ప్రేమతో ఉండటం. ఈ రోజుల్లో మనం అందరితో ప్రేమగా వ్యవహరించాలి.

అలా మన ధర్మాన్ని మనం సాత్విక, శ్రద్ధా సహిత, కర్తవ్య ప్రధాన ధర్మంగా చూడాలి. 'స్వకర్మణా తమభ్యస్య సిద్ధిం విందతి మానవః' ఎవరైనా సరే వాళ్ళ కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వర్తించాలి.

తల్లి, భార్య, అమ్మమ్మ, నాయనమ్మ బంధుత్వాల మధ్య traffic jam లేకుండా, Interactionతో ఉండాలి. మాట్లాడుకోవాలి కానీ మధ్యలోకి రాకుండా జాగ్రత్తగా మధ్యేమార్గంలో వెళ్ళాలి. ఎక్కువ పట్టించుకోరాదు, మరీ ఉదాసీనంగా ఉండకూడదు. మన ధర్మం ఋజు కుటిలానికి మధ్యలో ఉండాలి. దానం ఇవ్వడంలో ఒక వ్యక్తిని అంగీకరించడం అనేది ముఖ్యవిషయం. వాళ్ళకు మకుటం పెట్టడం అనేది వేరుగా ఉంటుంది. కృష్ణదేవరాయలవారిని ఇంకా పెద్ద చక్రవర్తులను వారి పేర్లతో ఇప్పటికీ మనం గుళ్ళలో కార్యక్రమాలు



చేస్తున్నామంటే దాతృత్వాన్ని మన సనాతనధర్మం ఎంత గౌరవిస్తోందో తెలుస్తోంది. ఇప్పుడు మూడు విషయాలు చెప్పాము. 'అక్రోధేన క్రోధమ్' 'అశ్రద్ధయా శ్రద్ధామ్' 'దానేన అదానమ్' తరువాత 'సత్యేన అనృతం' అబద్ధాలను జయించాలంటే సత్యం ద్వారానే జయించాలి అని సామవేదం మనకు నేర్పిస్తుంది. మన ధర్మం మనలోని సత్స్వభావాన్ని తెలుపుతుంది. 'యమ నియమ ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన సమాధి' అని కమక్రమముగా నేర్పించేది సనాతనధర్మం. మనవాళ్ళు విద్య కోసం 'ఉదర నిమిత్తం బహుకృత వేషః' అన్నట్లుగా ఉదర పోషణార్థం చాలా ఖర్చు చేస్తున్నారు. అది తప్పేమి కాదు. చెయ్యవలసిందే. అంటే కడుపు నిండకపోతే మనస్సు నిండదు. అందరికీ జ్ఞానం వెంటనే వచ్చేది కాదు. కానీ కడుపుతో పాటు మనస్సు కూడా నిండాలంటే మనకి చట్టాలు మార్గదర్శనం చేసినా, కొన్ని పరిమిత కాలానికి, కొన్ని ఎప్పటికీ పనికివస్తాయి. కానీ మహర్షులది, మహాత్ములది, వేదానిది, సత్యానిది దీర్ఘదర్శనం. అందువల్ల కొన్ని మంచి విషయాలు, మంచి నిర్ణయాలు రావటానికి మహర్షుల యొక్క మార్గదర్శనం మనకి కావాలి. వేదం యొక్క మార్గదర్శనం కూడా కావాలి. అన్నింటినీ కలుపుకొని మనం కొత్త జీవన విధానాన్ని దేశంలో ఏర్పాటు చెయ్యాలి. అందుకని ఆధ్యాత్మిక విద్యకి సంబంధించిన పాఠశాలలు అనేకం ఏర్పాటు చెయ్యాలి. భగవద్గీత, సుందరకాండ, నామ సంకీర్తన, హారతులు, ముగ్గులు వేయడం నేర్పించాలి. ముగ్గులు వేయడంలో యోగశాస్త్రం ఉంది. కూర్చుని పద్మాసనం వేసి ధ్యానం చేయడం, వడ్డించడం, మాలలు కట్టడం, ముగ్గులు వేయడం అన్నీ ఒక యోగం. దాంట్లో వంగడము, మౌనము, శుభ్రత ఉంటుంది. మహాయోగం కాకపోయినా అది కూడా యోగమార్గమే. మనకు ఉండే అనుష్ఠానాలన్నీ కూడా శరీరానికి, బుద్ధికి, మనస్సుకి, మంచి కలిగిస్తాయి. శరీరంలో ఆరోగ్యం, బుద్ధిలో వైశిష్ట్యం, మనస్సులో విశాల దృక్పధం, ద్వేషరహితమైన, అహంకార రహితమైన, సాత్వికమైన, గరళం లేకుండా సరళంగా ఉండటానికి సనాతనధర్మాన్ని మనం పాటించాలి. ఆ సనాతనధర్మం నేర్పే పండితులని మనం తయారుచేయాలి. తెలుగు, హిందీ, మరాఠీ, ఏదైనా ఆ భాషలో ఉండే భక్తి సాహిత్యాన్ని నేర్పించాలి. ఆ రోజుల్లో తంజావూర్‌లో మరాఠీ ప్రచారంలో ఉండేది. విఘ్నేశ్వర హారతి కూడా ఇప్పుడు మరాఠీలో పిల్లలకి చెప్పమన్నాము. 'జయదేవ జయదేవ జయ మంగళమూర్తి దర్శన మాత్రేన మనః కామన పూర్తి జయదేవ జయదేవ' అలాంటి భక్తి గీతాలు అన్నీ నేర్పించాలి. మాతృభాష ద్వారా సంస్కృత భాషని కాపాడటం కోసం మంచి పాఠశాలలు రావాలి. మనం Finished Productsని చూస్తున్నాము.



విత్తనం నుండి వస్తున్న బియ్యం, పప్పు, చూస్తున్నాము. కానీ విత్తనాన్ని మనం తయారు చేయాలి. వచ్చిన వస్తువులని మనం వాడుకుంటున్నాము. అంటే మనం Applied Science వాడుతున్నాము. కానీ మూల విజ్ఞానం మనం సాధించాలి. అది శాస్త్రం కావచ్చు, మూల విజ్ఞానం కావచ్చు. లౌకికమైన విజ్ఞానంలో కూడా మనవాళ్ళు ప్రధానంగా ఉన్నారు కానీ విజ్ఞాన ఉత్పత్తులు చేసేవారిగా రావాలని కొంతమంది ప్రయత్నం చేస్తున్నారు. మందులు, కంప్యూటర్ విద్య ఇంకా అనేక విషయాలలో మనం మూల విజ్ఞానాన్ని కనిపెట్టాలి. పాత విషయమే అయినా ఆ రోజుల్లో గణితంలో జీరో గురించి మనమే చెప్పాము. మరి ఇప్పుడు డిగ్రీ పాసు చేయిస్తున్నాము కాని మూల విజ్ఞానం కోసం ప్రయత్నం చేయడం లేదు. అసలు ధర్మం తీసుకుంటే ప్రాథమికమైన శిక్షణ నుంచి పెద్దబాలశిక్ష పిల్లలకు నేర్పాలి. రామాయణ, మహాభారత కథలు, పురాణాలు, సాహిత్యము, అన్నమాచార్యులు, భద్రాచల రామదాసు, త్యాగరాజస్వామి మొదలైనవారి విషయాలన్నీ కూడా నేర్పించాలి. సంగీతం, సాహిత్యం, కళలు, అష్టావధానం బుర్రకథ, తోలుబొమ్మలాట, వీటన్నిటిలో నైపుణ్యం, పుణ్యం రెండూ ఉన్నాయి. ఉద్యోగాలు, వాహన వసతులు, మందులు ఎలా మనకు ముఖ్యమో అలా మంచి ఆలోచన కోసం మన ధర్మాన్ని పాటించాలి. ఈ ఊరిలో చాలా గుళ్ళు, ఆధ్యాత్మిక కేంద్రాలు ఉన్నాయి. ఆధ్యాత్మిక కేంద్రాలు ఇంకా రావాలి. మంచి పాఠశాలలు, ప్రవచన కేంద్రాలు ఏర్పాటు చేసుకుని భావి తరాన్ని మన ధర్మంలో, సంస్కృతిలో ప్రవేశపెట్టాలి. ఇక్కడికి బాసర జ్ఞాన సరస్వతి గుడి దగ్గరలోఉంది. బాసర భాసురంగా ఉండాలి. దానికోసం మీరంతా కలుసుకుని శంకరమఠం నిర్మాణం కానీ వేదపాఠశాల కానీ ఇంకా ఏదైనా మంచి కార్యక్రమాలు కాని చేయాలి. కంచి పీఠం తరఫున అనేక పాఠశాలలు ఏర్పాటు అయినాయి. తిరుపతి పక్కన 'సాంప్రదాయ పాఠశాల' ఉంది. పురోహిత కుంటుంబాలకు సంబంధించిన అమ్మాయిలకు జుట్టు, కట్టు, బొట్టు, లాంటి అనేక ధర్మసూక్ష్మాలను నేర్పించడానికి ఈ పాఠశాలలు ఏర్పాటు అయ్యాయి. శైవాగమం అర్చకుల కోసం, వైష్ణవ అర్చకుల కోసం పాంచరాత్రం, వైఖానసం పాఠశాలలు ఏర్పాటు చేశాం. చెన్నైలో సంగీత పాఠశాల నడుస్తున్నది. ఇంకా వాల్మీకి రామాయణ పాఠశాల, జ్యోతిష్య పాఠశాల యోగా పాఠశాలల ఉద్దేశ్యం ఉన్నది. భాషా పాఠశాల అంటే తెలుగుభాష కోసం ఒకటి పెట్టించాలనే ఉద్దేశ్యం ఉన్నది. అక్కడ భాగవత రామాయణాలు నేర్పించాలి.

ప్రధానమైన Factory ఒకటి ఉంటుందనుకోండి. Nuts, Bolts తయారు చేసేది ఇంకోటి ఉంటుంది. Spare parts ఉండాలి కదా! Spare parts లేకపోతే ప్రధానమైన Engine ఉన్నచోటనే ఉంటుంది. అది పరిగెత్తదు. అది నడవాలంటే సహకార కారణాలు ఉండాలి. అలా మనధర్మం ఒక వటవృక్షం. అమృతం లాంటిది. దీనిని ఆస్వాదించడానికి మనం 'రసజ్ఞా రస శేవధిః'లాగా ఉండాలి. మనం తెలుసుకోవడానికి 'రసోవైసః' అని చెప్పినట్లుగా మనలో స్వారస్యం ఉండాలి. దానికి మహాత్మ్య కథలు చెప్పాలి. భాగవత కథ చెప్పాలంటే ముందురోజు భాగవత మహాత్మ్యం చెప్తారు. తరువాత భాగవత పురాణం చెప్తారు. ఇప్పుడు మనం ఏ దశలో ఉన్నామంటే మహాత్మ్య కథనం అనే ప్రవేశ ద్వారంలో ఉన్నాము. ధర్మానికి సంబంధించినంత వరకు కూడా ప్రవేశ ద్వారంలోనే ఉన్నాము. అందుకని అందరికి అభినివేశము, ప్రవేశము వచ్చే విధంగా ప్రచారం

చేయాలి. ఆచారం, అనుష్ఠానం కోసం ప్రచారం కావాలి. కొందరు ప్రచారంతో ప్రారంభిస్తారు. మనం ప్రచారంతో పూర్తి చేస్తాం. అదే మనకీ మిగతావారికి ఉండే తేడా. ప్రచారం తోటి అన్నీ అయిపోతాయి అనేది ఒక వాదన అయితే, మనకి ప్రచారం కంటే మౌనమే ముఖ్యం. మానము, మౌనము రెండూ ముఖ్యం. (మూలనక్షత్రం రోజు మన కంచి మహాస్వామివారు మౌనం ఆచరించేవారు. మేము చాతుర్మాస్యంలో కాకినాడ గోశాలలో అదే విషయం చెప్పిన తరువాత ఇప్పుడు భక్తులు ఒక అరగంట మౌనం పాటిస్తున్నారు.) భగవద్గీతలో చెప్పినట్టు 'స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్' పెద్ద భయం నుంచి, కష్టం నుంచి బయటపడటానికి చిన్న కార్యం చేస్తే సరిపోతుంది. కొన్ని చోట్ల అడ్డు పెడితే చెరువును కాపాడవచ్చు. కొన్ని చోట్ల ద్వారం లేకుండా ఉంటే అక్కడి వస్తువులని కాపాడవచ్చు. అలా మనం ఎక్కడ గట్టిగా ఉండాలో ఎక్కడ సరళంగా ఉండాలో చూసుకొని ధర్మవిద్యా కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలి. దానికోసం 'పద్ధతి' అనే ఒక కార్యక్రమం తయారుచేశాము.

ధర్మమునకు సంబంధించిన ప్రాథమిక అంశాలను పిల్లలకు నేర్పించటానికి తల్లిదండ్రులు ముందుకు రావాలి. ధర్మం ద్వారా దేశాన్ని కాపాడే అవసరం ఈ రోజు ఉంది. ధర్మం అంటే స్వంత లాభం మాత్రమే కాదు. దేశంలో మంచి పరిస్థితి, సౌజన్యము, ప్రశాంతము, పర్యావరణం ఉండాలంటే అందరూ ధార్మిక వ్యక్తులుగా, ధర్మాన్ని గౌరవించేవారుగా ఉండాలి. ధర్మవిరుద్ధం చేయనివారుగా ఉండాలి. అలాంటి మంచి ధార్మికమైన పర్యావరణాన్ని మనం తయారు చెయ్యటానికి Environment ముఖ్యం. సరిగ్గా వర్షాలు పడి, ఎండలు మరీ విపరీతం (Global Warming)కాకుండా ఉండాలన్నా పర్యావరణం ముఖ్యం. (హరితహారం) అలా ధర్మానికి కూడా లోపల, బయట అనుకూలమైన పర్యావరణం 'అంతర్ బహిశ్చ తత్ సర్వం వ్యాప్య నారాయణః స్థితః' అలాగే మనుషుల మనస్సులో కూడా లోపల, బయట మంచి పర్యావరణం ఉండి అందరూ బొట్టుపెట్టుకుని, గురుభక్తి కలిగి కులదేవతా పూజ చేస్తూ ఉండాలి.

కొత్తగా ఎన్ని గుళ్ళు కట్టుకున్నా ఎల్లమ్మ గుడి వంటి గ్రామదేవతా మందిరాలు ముఖ్యము. భక్తులు వేంకటేశ్వరస్వామికి గుళ్ళు కట్టడానికి ధనవిరాళం ఇవ్వటం చేస్తుంటారు. మంచిదే.





ధర్మప్రచారానికి గ్రామదేవత మందిరాలు, జాతరలు ఏమి ఉంటాయో అవి కూడా జరుపుకోవాలి. కులదేవతా గుళ్ళలో విధిగా పూజలు చేయించాలి. ఎక్కడో గ్రామం మధ్యలో ఒక రాయి ఉంటుంది. దాని మీద కొన్ని అక్షరాలు ఉంటాయి. సూర్యుడు, చంద్రుడు, యంత్రం ఉంటాయి. అటువైపు వెళ్ళకూడదు, చుట్టుతిరిగి వెళ్ళాలి అని గ్రామస్థులు చెప్తారు. పదిరోజుల ఉత్సవ సమయంలో కంకణం కట్టుకున్నాము, గ్రామం నుండి బయటకు వెళ్ళడం కుదరదు లాంటి ఎన్నో ఆచారాలు ఉన్నాయి. మంత్ర పూర్వకంగా కొన్ని ఉంటాయి. క్రియాపూర్వకంగా కొన్ని ఉంటాయి. మొత్తానికి సదాచారం, సాంప్రదాయం, సంహిత మనకి ముఖ్యం. అందుకని వేదాలకు, వేదాలకు సంబంధించిన పురాణాలకు మనం అనుకూలంగా ఉండాలి. మనకి వేదం గర్భగుడి లాంటిది. మండపాల దర్శనంతో పాటు ప్రధానంగా దర్శించాల్సింది గర్భగుడి. కాబట్టి వేదాన్ని మనం గుర్తించాలి. దేశంలో వేదం శాస్త్రం ప్రచారం బాగా జరిగి సంక్షేమంగా ఉండాలి. మనం ఇదంతా చెప్పుకున్నా ప్రజలు, పండితుల సహకారంతోనే జరుగుతుంది. అందుకని పండితులకు హితము చేసే విధంగా ప్రభుత్వం మరియు ప్రజల ద్వారా మంచి పథకాలు తయారుచేసి మన ధర్మపరిరక్షణ పటిష్ఠంగా చేసుకోవాలి. కొత్తగా గుడులు కట్టాల్సిన అవసరం చాలా తక్కువ. గుళ్ళు కట్టేశారు. ఆ గుడిలో చైతన్యము, సాన్నిధ్యము, తేజస్సు, వర్చస్సు పెరగడానికి మనం దానాలు, ఇతర కార్యక్రమాలు, విద్యావిధానం, విద్వాంసులను పోషించడం చెయ్యాలి. విద్యను రక్షించాలంటే గురుకులాలు ఏర్పాటు చేయాలి. దంపతీపూజ, కన్యాపూజ, వటుకభైరవపూజ, కుమారభోజనం లాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసి కల్యాణ యోజన చెయ్యాలి. అందరికీ కూడా మంచి కుటుంబం ఏర్పాటు కావాలి. బంధుమిత్రులు, వారి వారి సమాజాలలో కులసంఘంలో సంస్కృతి విభాగం ఏర్పాటు చేసుకుని యువతను ధర్మమార్గంలో నడపాలి.

**సర్వేజనాః సుఖినో భవంతు**

**ధర్మో రక్షతి రక్షితః**

**హర నమః పార్వతీ పతయే హరహర మహాదేవ**

# శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి విజయయాత్రా విశేషాలు

## వారణాసిలో చాతుర్మాస్యదీక్షలో స్వామివారు



ఆగస్ట్ 3వ తేదీ చేత్సింగ్ కోట ఘాట్ వద్ద గంగ హారతిని వీక్షించిన స్వామివారు.



వారణాసిలో గంగాతీరంలో జరిగిన కావేరి పూజ - ఆది పెరుక్కు



ఆగస్ట్ 3వ తేదీ వారణాసిలో వృక్షారోపణం కార్యక్రమంలో పాల్గొన్న స్వామివారు.



ఆగస్ట్ 3వ తేదీ చాతుర్మాస్యదీక్ష సందర్భంలో ఉత్తర భారతానికి చెందిన ప్రింట్, డిజిటల్ మీడియా విలేకరుల సమావేశంలో పాల్గొన్న స్వామివారు.




ఆగస్ట్ 3వ తేదీ వారణాసిలో చాతుర్మాస్యదీక్ష సందర్భంలో పవిత్ర కావేరీ పూజ– ఆది పెరుక్కు ఉత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. పవిత్ర కావేరి జలాన్ని తీసుకువచ్చి విశేష పూజలు చేసి, హారతి ఇచ్చి కలశంలో తీర్థాన్ని భక్తులకు అందించారు. స్వామివారు భారతదేశంలో నదులను దైవంగా పూజిస్తామని, జాతీయ భావము, సాంస్కృతిక ఏకత్వం పెంపొందడానికి ఆది పెరుక్కు వంటి పండుగలను విశేషంగా జరుపుకోవాలని ఉపదేశించారు.

# వారణాసిలో శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారి జయంతి ఉత్సవాలు











**ఆగస్ట్ 3వ తేదీ** పూజ్యశ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారి జయంతి ఉత్సవాల సందర్భంగా వారం రోజులుగా నిర్వహిస్తున్న ఋగ్వేద సంహిత హవనం, చతుర్వేద పారాయణం గంగానది ఒడ్డున గల చేత్సింగ్ కోటలో శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి దివ్య సన్నిధిలో ముగిశాయి. ఈ వేడుకలకు ఉత్తర, దక్షిణ భారతదేశానికి చెందిన పలువురు వేద పండితులు తరలివచ్చారు. హోమం, పూర్ణాహుతి, వేద స్వస్తి వచనం నిర్వహించారు. పూజ్య శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారి ఉత్సాహం, ప్రేరణ, ఆశీర్వాదం వల్లే ఇలాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని స్వామివారు ప్రసంగంలో పేర్కొన్నారు. భక్తులకు ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. జయంతి రోజు సాయంత్రం స్వర్ణ పాదపూజ నిర్వహించి జయంతి సభను వైభవంగా నిర్వహించారు.





జయంతి సందర్భంగా ఆగస్ట్ 3వ తేదీన ఆర్థికంగా అవసరంలో ఉన్నవారికి సహాయంగా టైలరింగ్ మిషన్, ఐరన్ బాక్స్, పెయింట్ మెటీరియల్, టెంట్, అగ్రికల్చర్ మెటీరియల్, సెలూన్ మెటీరియల్, సంగీత వాయిద్యాలు మొదలైనవి ప్యాలెస్ గ్రౌండ్‌లో శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారి సంస్మరణ సభలో అందిచారు.





శ్రీ ఎ. కుప్పుస్వామిగారు ఆంగ్లంలో రచించిన 'SHANKARACHARYA and His connection with kanchipuram' అనే ఎనిమిది అధ్యాయాల పుస్తకం నుండి తెలుగు అనువాదం క్రిందటి సంచిక తరవాతి భాగం...

# కాంచీపురంతో శ్రీశంకరాచార్యుల అనుబంధం

### శ్రీ శంకరుల చివరి ఆశ్రయం కంచి

భూలోకంలో తన జీవితం ముగిసే సమయంలో దక్షిణ మోక్షపురి అయిన కంచిని శంకర భగవత్పాదులు చక్కదిద్దారు. ఈ వాస్తవం గురించి అనేక రచనలు ప్రస్తావిస్తాయి.

1) ఆనందగిరి రచించిన శంకరుల జీవిత చరిత్ర (మద్రాసు యూనివర్సిటీ ఎడిషన్ సహా అన్ని కథనాలు, ముద్రిత రాతప్రతులు) సహా అన్నీ –

**తతః పరం సర్వలోక గురుః ..... స్వయం స్వలోకం గంతుమిచ్ఛుః కాంచీనగరే ముక్తిస్థలే కదాచిత్ ఉపవిశ్య స్థూలశరీరం సూక్ష్మే అంతర్ధాయ సద్రూపో భూత్వా సూక్ష్మం కారణే విలీనం కృత్వా చిన్మాత్రో భూత్వా అంగుష్ఠమాత్రపురుషః తదుపరి పూర్ణం అఖండమండలాకారం ఆనందం ప్రాప్య సర్వం జగత్ వ్యాపక చైతన్యం అభవత్. సర్వవ్యాపక చైతన్య రూపేణ అద్యాపి తిష్ఠతి.** (ప్రకరణ 74)

(కనుక, జగద్గురువులు (శంకరులు) మోక్షపురి కంచిలో ఒకసారి కూర్చుని తన శాశ్వత నివాసానికి వెళ్ళాలని కోరుకుంటూ,

తన స్థూల భౌతిక రూపాన్ని సూక్ష్మంగా గ్రహించి, దానిని బొటనివేలు ఆకారంలోకి మార్చి శాశ్వత ఆనందాన్ని పొందడమే కాక నేటికి కూడా సర్వవ్యాప్తమైన 'చిత్'గా నిలిచి ఉన్నారు.)

2) రాజ చూడామణి దీక్షితుని శంకరాభ్యుదయంలోని ముగింపు శ్లోకం ప్రతి రోజూ పరమానందాన్ని పొందుతూ శంకరులు కామేశ్వరియైన కామాక్షిని ఆరాధించడం గురించి ప్రస్తావిస్తుంది.

**కంపాతీర నివాసినీం అనుదినం కామేశ్వరీం అర్చయన్.**

**బ్రహ్మానందం అవిన్దత త్రిజగతాం క్షేమంకరః శంకరః.**

3) ప్రాచీన, విస్తారమైన రచన 'శివరహస్యం' గ్రంథ తొమ్మిదవ భాగంలోని 16వ అధ్యాయంలో ఆచార్యుని జీవితం గురించి సంక్షిప్త వర్ణనను ఇస్తుంది. ఈ రచనను జయచామ రాజేంద్ర గ్రంథమాల శ్రేణిలో కానరీ లిపిలో కన్నడ భాషాను వాదంతో నెం. 32గా ముద్రించారు. అంతేకాకుండా ఈ రచన రాతప్రతులు భారతదేశవ్యాప్తంగా ఉన్న బరోడాలోని ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీ, మద్రాసులోని ప్రభుత్వ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీ, మద్రాసులోని అడయార్ గ్రంథాలయం, తంజావూరులోని సరస్వతీ మహల్ గ్రంథాలయం తదితరాలు సహా అనేక మాన్యుస్క్రిప్ట్ గ్రంథాలయాలలో ఉన్నాయి. దిగువన పేర్కొన్న నిర్దిష్ట వాక్యాల ద్వారా, శంకరులు ఐదు స్ఫటిక లింగాలు – యోగ, భోగ, వర, ముక్తి, మోక్ష లింగాలను పొందిన తర్వాత భూమిపైకి వచ్చి, బౌద్ధ, జైన మొదలగు పండితులను ఓడించి, కంచిలోని తన సొంత ఆశ్రమంలోనే సిద్ధి (శాశ్వత ఆనందం) పొందారనే భావానికి రావచ్చు.

**సంగృహ్య లింగాని జగామ వేగాత్ భూమౌ స బుద్ధార్హత–జైన–మిశ్రాన్,**

**తద్యోగ–భోగ–వర–ముక్తి–మోక్ష–యోగ–లింగార్చన ప్రాప్త జయః స్వకాశ్రమే.**

**తాన్ వై విజిత్య తరసాక్షత–శాస్త్ర–వాదైః మిశ్రాన్ స కాంచ్యామ్ అథ సిద్ధిమాప. (IX-16-45,46)**

4) మార్కండేయ సంహిత, అనే ప్రాచీన పౌరాణిక గ్రంథంలో 100 ఖండాలు, పరిస్పందాలనే ఉపవిభాగాలను కలిగి ఉంది. ఇది సంస్కృత రాతప్రతుల వివరణాత్మక పట్టిక, యూనివర్సిటీ ఆఫ్ మైసూరులోని ఓరియంటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సంపుటి 6, పేజీ 191 (అపెండిక్స్ –332, సీరియల్ నెం. 18179ఎంఎస్. నెం. పి. 3387/1 – శీర్షిక 'శంకరచరితం')లోని 72వ ఖండంలోని 7 – 8 ఉప విభాగాలు శంకరుని చరిత్రను సంక్షిప్తంగా వివరిస్తాయి. ఇది 72వ ఖండంలోని 7వ పరిస్పంద చివరిలోని ఆశ్వాసాంత గద్యం (చివరిమాట)లో వెల్లడవుతుంది. ఈ ఆశ్వాసాంత గద్యం ఈ విధంగా ఉంది –

**ఇతి శ్రీ మార్కండేయ సంహితాయాం శతాఖండాత్మికాయాం ద్విసప్తతితమఖండే సప్తమ పరిస్పన్దః**

ఈ కృతిలోని 72వ ఖండంలోని ఏడవ పరిస్పంద లోని ఒక శ్లోకం మహాత్మ, శంకరులు, 'శ్రీవిద్య రాజ–పీఠ' ఆరాధన కోసం కామాక్షిని ప్రతిష్ఠించి, సురేశ్వరుని స్థాపించిన అనంతరం కంచిలో చిత్ స్వరూపాన్ని అంటే సచ్చిదానందాన్ని పొందారని వివరిస్తుంది.

శంకరుడు కంచిలో తన భౌతిక కాయాన్ని విడిచిపెట్టారని సూచించే శ్లోకం ఈ విధంగా ఉంది –

**కాంచ్యామ్ శ్రీ కామకోటీం కలిమలశమనీం కల్పయిత్వా సురేశే**

**శ్రీ విద్యారాజ పీఠార్చన మహిత మహారాజ్య సామ్రాజ్య లక్ష్మీమ్.**

**సంవేశ్యాత్మీయశిష్యే సకలభువనసమ్మోదహేతోః మహాత్మా**

**చిద్రూపస్వానుభూతిః జయతి భవమహాంభోధి సంతారణాయ. (72–7–11)**

రామభద్ర దీక్షితుని 'పతంజలి విజయం' – (కావ్యమాల సిరీస్ నెం. 51, నిర్ణయ సాగర్ ప్రెస్, బాంబే)లో దిగువన ఇచ్చిన శ్లోకం కనిపిస్తుంది –

**గోవిందదేశికముపాస్య చిరాయ భక్త్యా**
**తస్మిన్ స్థితే నిజమహిమ్ని విదేహముక్త్యా,**
**అద్వైత భాష్యముపకల్ప్య దిశో విజిత్య**
**కాంచీపురే స్థితిమవాప స శంకరార్యః (VIII-7)**

శంకరులు తన భాష్యాలను రచించిన తర్వాత, దిక్కులను జయించిన అనంతరం కంచిని శాశ్వత నివాసం చేసుకున్నారని పై శ్లోకాలు సూచిస్తున్నాయి.

6) జర్మన్ పండితుడు అయిన డాక్టర్ షుల్జ్ దక్షిణ భారతంలో సంస్కృత రాతప్రతుల అన్వేషణపై నివేదిక (మద్రాసు ప్రభుత్వ ప్రెస్ 1908లో ముద్రించిన – నెం. 2146 – భాగం 3) తుంగభద్ర ప్రాంతంలోని భారతి సన్యాస క్రమంలోని పీఠాధిపతుల జాబితాను కలిగి ఉంది. ఈ జాబితాలో ఆది శంకరాచార్యుల గురించి కొన్ని శ్లోకాలు కనిపిస్తాయి. విస్తృతంగా ప్రయాణించిన అనంతరం శంకరులు తన ఇష్టానుసారమే కంచిని చేరుకుని, అక్కడే తన పరమపదాన్ని చేరుకకున్నారనే దానికి సంబంధించినది దిగువన పేర్కొన్న శ్లోకం. ఈ శ్లోకం ఏం చెప్తుందంటే –

**ఆగచ్ఛన్ స్వేచ్ఛయా కాంచీం పర్యటన్ పృథివీతలే,**
**తత్ర సంస్థాప్య కామాక్షీం జగామ పరమం పదం.**

7) తుంగ, భద్ర నదుల సంగమం వద్ద కలిగిన శంకర పీఠానికి చెందిన గురుపరంపర నామమాల కూడా జగద్గురువులు సుదీర్ఘ, విస్తృత ప్రయాణాల అనంతరం తన ఇష్టపూర్వకంగానే కంచికి చేరుకున్నారని, దేవి కామాక్షిని ప్రతిష్ఠించి, అక్కడే సిద్ధి పొందారని దిగువన పేర్కొన్న శ్లోకంలో వివరిస్తుంది.

**స్వేచ్ఛయా పర్యటన్ భూమౌ యయౌ కాంచీపురీం గురుః**
**తత్ర సంస్థాప్య కామాక్షీం దేవీం పరమగాత్ పదం.**

ఆధునిక కాలానికి వస్తే, పలువురు విద్వాంసులు భిన్న భాషలలో చేసిన రచనలలో శంకరుల చివరి ఆశ్రయం కాంచీపురమేనని ప్రస్తావించారు.

8) ఎన్సైక్లోపీడియా అయిన బెంగాలీ విశ్వకోశ (హిందీ ఎడిషన్), కంచి అనే పదం కింద దిగువనన పేర్కొన్న సమాచారాన్ని ఇస్తుంది –

"काञ्चीपुर एक प्राचीन महातीर्थ है। केवल तीर्थ होहि नहिं,
काञ्ची महापीठ स्थान है। शिवकाञ्ची स्थित एकाम्रनाथ महादेव
का आदिलिङ्ग, भगवती कामाक्षी का मूर्ति, भगवान् शङ्कराचार्य
की प्रतिमा एवं समाधिस्थल ...कामाक्षी मन्दिर कुछ छोटा है।
इशी के प्राङ्गण में भगवान् शङ्कराचार्यकी समाधि है। इसी
समाधि पर उनकी प्रस्तरमयमूर्ति प्रतिष्ठित हैं।"

పైన పేర్కొన్న హిందీ వాక్యాలు శంకరులు సిద్ధి పొందిన ప్రదేశం కంచి అని పేర్కొంటాయి.

9) పండిత మహామహోపాధ్యాయ గోపీనాథ్ కవిరాజ్ (పద్మవిభూషణ్) తన 'భారతీయ సంస్కృతి ఔర్ సాధన' (హిందీలో)లో

కంచిలోని కామాక్షి ఆలయం ప్రసిద్ధి చెందిందని, ఆ ఆలయంలో శంకరుని రాతి విగ్రహం ఉందని, ఆ ప్రదేశంలోనే ఆయన సిద్ధి పొందారని పేర్కొన్నారు. ఆ వివరణ ఇలా ఉంది –

"प्रसिद्ध है कि, काञ्ची में कामाक्षी देवी के मन्दिर में जहां पर आचार्य शङ्कर की पाषाणमूर्ति है, उसी स्थान में उन्हें सिद्धिप्राप्ति होगयी थी।"

"... ఒక సంప్రదాయం ప్రకారం దక్షిణ భారతదేశంలో కంచిలోనే ఆచార్యులు (శంకరాచార్య) తన తుది శ్వాస విడిచారు అని ఉంది. ఇతర ఆధారాల ప్రకారం, ఆయన హిమాలయాలలోని గుహలలో అదృశ్యమై కేదార్‌నాథ్‌లో మరణించారు ఉంది. అయితే, మొదటి భావనకే ఎక్కువ సంభావ్యత ఉంది." (పేజీ 240, గోపాల్ బసు మల్లిక్ లెక్చర్స్, బై డా॥ ఎస్.కె. బెల్వాల్కర్, పూనా, 1929).

తన, 'ఏజ్ ఆఫ్ శంకరాచార్య' (అడయార్ లైబ్రరీ, మద్రాస్ – 1980 – పేజీ 22)లో 'తన జీవతపు చరమాంకంలో ఆయన దక్షిణాదికి వచ్చి, ముప్పై రెండేళ్ళ పిన్న వయసులోనే కంచీవరంలో తన దేహాన్ని విడిచిపెట్టవలసి వచ్చిందని' పండిట్ ఎన్. భాష్యాచార్య పేర్కొన్నారు. శ్రీముఖ బిరుదావళిలో శంకరాచార్య మఠం, కంచి అనేవి ప్రాచీన కాలం నుంచి ఎటువంటి మార్పులేకుండా ఉనికిలో ఉన్నాయని పేర్కొనడాన్ని ప్రస్తావించక తప్పదు. దిగువన పేర్కొన్న విశేష నామం కనిపిస్తుంది –

'శంకరభగవత్పాదాచార్యాణాం అధిష్ఠానే సింహాసనాభిషిక్త'

శంకర దిగ్విజయంలో మాధవుడికి ఆపాదించిన 16వ కాండంలోని 103 శ్లోకంపై వ్యాఖ్యానంలో ఈ విధంగా పేర్కొంటుంది –

**'గౌరీరమణావతారత్వం తు శ్రీశంకరాచార్యస్యోక్తం శివరహస్యే నవమాంశే షోడశాధ్యాయే'**

ఆ తర్వాత, 'శివరహస్యం'లోని 9వ అంశంలోని 16వ అధ్యాయాన్ని పూర్తిగా పేర్కొనడం జరిగింది. 16వ అధ్యాయంలోని 46వ లేదా చివరి శ్లోకం అన్నది వ్యాఖ్యానం చివరిలో పేర్కొన్న కాంచ్యామథ సిద్ధిమాపతో పూర్తి అవుతుంది.

సుమారు నలభై ఏళ్ళ కిందట, ఆదిశంకర విగ్రహాన్ని ద్వారకా మఠాధిపతి కేదార్‌నాథ్‌లో ప్రతిష్ఠించారు. కేదార్‌నాథ్‌లో శంకరుల స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయడంలో పాత్ర పోషించినవారిలో నాటి ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి కీశే డా॥సంపూర్ణానంద ఉన్నారు. కాగా, శంకరులు సచ్చిదానందాన్ని పొందిన ప్రదేశం అదేనన్న ఆయన అభిప్రాయంపై డా॥ టి.ఎన్. రామచంద్రన్ (అప్పటి భారత ప్రభుత్వ ఆర్కియాలజీ విభాగం జాయింట్ డైరెక్టర్) ఒక లేఖలో స్పష్టీకరణ ఇచ్చారు. ఆ లేఖనను 6 జులై 1958లో రాశారు. ఆ లేఖలో మిగిలిన విషయాలతో పాటుగా, పరిశీలించదగిన అంశాలు –

"ఇటీవలే నేను ద్వారకా పీఠానికి చెందిన శంకరాచార్యులతో ఈ విషయాన్ని చర్చించేందుకు అవకాశం దొరికింది. ఈ ప్రదేశంలో శ్రీ శంకరాచార్యులు మరణించారని రుజువు చేసేందుకు ఏ ఆధారాలూ లేవు" అన్నట్లుగా తెలుస్తోంది. డా॥ సంపూర్ణానందకు ఈ లేఖరాసిన ఒక ఏడాది అనంతరం, కేరళలోని గురువాయూర్‌కు చెందిన ప్రముఖ సాధువు శ్రీ సహజానంద తన లేఖలో ('ది హిందూ' పత్రికలో 16జూన్ 1959లో ప్రచురితం) "జోసీ మఠంలో విచారించినప్పుడు వారు అది (కేదార్‌నాథ్‌లోని స్మారకచిహ్నం) అన్నది కేవలం సంకల్ప సమాధి, వాస్తవ సమాధి ఆ ప్రదేశంలో కాదు" అని పేర్కొన్నారు.



# మూకపంచశతి ఆర్యాశతకం

- బాలాత్రిపురసుందరి చిర్రావూరి


శ్లో॥ లీనస్థితి మునిహృదయే ధ్యానస్తిమితం తపస్యదుపకల్పమ్ ॥
పీనస్తనభరమీడే జి మీనధ్వజతన్త్రపరమతాత్పర్యమ్ ॥ 19 ॥

**తాత్పర్యం:-** కంపాతీరమునందు తపస్సు చేస్తూ, మునులమనస్సులయందులీనమై, ధ్యాననిశ్చలముగా నున్న, కాదివిద్యాతంత్రపరమతాత్పర్యమును స్తుతించెదను.

**బాలమనోజ్ఞా:** మునుల ధ్యేయవస్తువు ఆ తల్లియే అయి వారి హృదయములయందు లీనమైపోయినదట. ఆ కామాక్షియే కంపాతీరమున నిశ్చలమైన ధ్యానస్థితిలో ఉండి మనకు దర్శనమునిస్తూన్నది. ధ్యాతగా ఆ తల్లి తపస్సును ఏవిధంగా చేయాలో ఉపదేశిస్తున్నది. కాదివిద్య అనగా శ్రీవిద్యకు ఆవిడే పరమతాత్పర్యమై ధ్యానగమ్యమై ఉన్నది. " ధ్యాన ధ్యాతృ ధ్యేయరూపా" అని లలితాసహస్రనామం. కాదివిద్యాపరతంత్రస్వరూపమైన ధ్యానముగా, కంపాతీరములో ధ్యాతగా, మునుహృదయాలలో ధ్యేయముగా ఆ తల్లిని స్తుతిస్తున్నాను.

శ్లో॥ శ్వేతా మందరహసితేశాతా మధ్యే చ వాఙ్మనోఽతీతా ॥
శీతా లోచనపాతే స్ఫీతా కుచసీమ్ని శాశ్వతీమాతా ॥ 20 ॥


**తాత్పర్యము:-** ఆ కామాక్షి శాశ్వతమైనది. తెల్లటి చిరునవ్వు గలది. కృశించిన నడుము గలది.వాక్కునకు మనస్సునకు అందనిది. చల్లని దృష్టిపాతము కలిగినది. నిండైన కుచప్రదేశము గలది.




**బాలమనోజ్ఞా:-** "వాఙ్మనో-తీతా" అంటూ నిర్గుణమైన పరబ్రహ్మను సగుణంగా నిత్యయగు తల్లిగా వర్ణిస్తున్నారు మూకకవి. "నిత్యానిత్యస్వరూపిణి" ఆ తల్లి. వ్యక్తమైతే ఆ తల్లి ఇలా ఉంటుందని వర్ణించగలం. అవ్యక్తమైనదానిని ఎలా వర్ణిస్తాము? అందుకే ఎంత వర్ణించినా వాక్కుకి మనస్సుకి అందనిది అని చెప్తూ కంపాతీరములో వ్యక్తమైన ఆ కామాక్షమ్మను కళ్లకు కట్టినట్లుగా వర్ణిస్తున్నారు. ఆ తల్లి చిరునవ్వు స్వచ్ఛంగా తెల్లగా ప్రకాశిస్తూ ఉన్నదట. సన్నని నడుము కలిగి ఉన్నదట. కామాక్షి చూపులు చల్లని వెన్నెల కురిపిస్తున్నవిట. ఆ తల్లి స్తనములు తన బిడ్డలైన భక్తులకు తరగని జ్ఞానాన్ని ఇవ్వటానికి నిండుగా ఉన్నవిట.

# శ్రీ కామకోటివాణి

## ప్రత్యేక సంచిక




వెల - 250 రూపాయలు
(Postage 50 రూపాయలు అదనం)

ప్రత్యేక సంచిక కోసము
సంప్రదించవలసిన వివరాలు:

**శ్రీ కంచి కామకోటి క్యాంపు**

Email ID - srikamakotivaani@gmail.com



## For Sri Kamakoti Vaani Subscription



### Bank Details:

**Account Name:**
Sri Kamakoti Touryatrika Trust SKV
Bank: ICICI Bank
Account No.: 440705000345
IFSC Code: ICIC0004407
UPI ID – SRIKAMAKOTIVAANI@icici

### Subscription

₹ 480 INR (India)
₹ 5000 INR
(Lifetime, for 10 years)

e-mail id -
srikamakotivaani@gmail.com

Scan me!

Sri Kamakoti Vaani subscription payment gateway.

Donors may please contact:
**Prayaga Srinivas : 800 800 1335**

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

**SRI CHANDRAMOULEESWARAYA NAMAHA**



## SHRI KANCHI KAMAKOTI PEETAM

### JAGADGURU SHANKARACHARYA SWAMIGAL

### SHRIMATAM SAMSTHANAM

1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

**www.kamakoti.org**

**fb.me/srikamakoti**

**youtube.com/kanchimath**

**twitter.com/kanchimatham**

**instagram.com/kanchimutt**

Koo

**koo @kamakoti**


**www.kamakoti.tv**

**www.kanchimuttseva.org**

## ESEVA PORTAL

for Online Puja Bookings & Contributions

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA



కరుణావరుణాలయ పాలయ మాం భవసాగరదుఃఖవిదూనహృదమ్ ।
రచయాఖిలదర్శనతత్త్వవిదం భవ శంకర దేశిక మే శరణమ్ ॥